http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 27 అక్టోబర్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## తుమ్మిడిహెట్టికి అభ్యంతరం లేదు..

# కమిటీ వేయండి



- తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సీఎం సానుకూలం!
- ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టికి ఓకే: ఫడణవీస్
- అధికారుల కమిటీతో సమగ్ర అధ్యయనానికి ప్రతిపాదన
- 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి తెలంగాణ ప్రతిపాదన
- ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రాజెక్టు ప్రయత్నాలు
- ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సంసిద్ధత
- ఆదిలాబాద్ గిరిజనుల అభివృద్ధికి ప్రాజెక్టు కీలకం: రేవంత్
- సాంకేతిక, పర్యావరణ అంశాల పరిశీలనకు మహారాష్ట్ర మొగ్గు
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఫడణవీస్‌కు ఆహ్వానం

హైదరాబాద్

తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశంపై ముంబయి వేదికగా తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సమావేశం జరిగింది. తెలంగాణ నీటి అవసరాలు, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రను కోరారు. తమ రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు తమకు అభ్యంతరం లేదని, - మిగతా3లో



## రక్షణ రంగానికి భారీ బూస్ట్

- రూ. 2.12లక్షల కోట్లతో డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్ కొనుగోలు
- రక్షణ దళాల ఆధునికీకరణకు కేంద్రం ఆమోదం
- సైన్యం కోసం డ్రోన్లు, గన్ సిస్టమ్స్, హెలికాప్టర్ల కొనుగోలు
- సరిహద్దుల్లో నిఘా, వైమానిక దాడుల నిరోధక సామర్థ్యాలకు బలోపేతం
- నౌకాదళం కోసం క్షిపణి నిరోధక వ్యవస్థలు, ఆధునిక పరికరాలు
- వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వాతావరణ రాడార్ల కొనుగోలు
- స్వదేశీ రక్షణ పరిశ్రమలకు ప్రాధాన్యం.. 82 శాతం కొనుగోళ్లు దేశీయంగానే

## మాకూ కావాలి ఓ జాబ్ కార్డు!



- జాబ్ కార్డుల కోసం గ్రామీణుల దరఖాస్తులు
- కరవు పరిస్థితుల్లో ఉపాధి పనులకు పెరిగిన డిమాండ్
- కొత్త కార్డుల కోసం 2.25 లక్షల కుటుంబాల దరఖాస్తులు
- ఇప్పటివరకు 39,188 కుటుంబాలకు కార్డుల జారీ
- గిరిజన కుటుంబాలకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వ ఆదేశాలు
- ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్ నియామకానికి చర్యలు
- వర్షాభావంతో వ్యవసాయ పనులకు దూరమైన కూలీలు
- ఉపాధి హామీ పనుల్లో అదనంగా 95 రకాల పనులు



## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- జ్ఞానేశ్ కుమార్ కోసం మోదీ సర్కార్ అన్ని రకాల ఎత్తుగడలు వేస్తోంది
- జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణగా మోదీ సర్కార్ ఎత్తుగడలు: ఖర్గే
- ఓటరు జాబితాలపై పారదర్శకత ఏదీ?
- సీఈసీ రాజీనామా సహా మూడు డిమాండ్లు
- ఎస్ఐఆర్ నిలిపివేయాలని కాంగ్రెస్ పట్టు
- నవంబర్ 1న ఢిల్లీలో భారీ సభకు పిలుపు
- ధరల పెరుగుదలపై మోదీ సర్కార్‌పై విమర్శలు
- ఉల్లిపాయలు, చక్కెర ధరల పెరుగుదలపై ఆగ్రహం

## దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యానికి పెద్దపీట

- బ్రిక్స్ దేశాల పార్లమెంటరీ సంబంధాల బలోపేతానికి భారత్ కృషి
- ప్రపంచ సవాళ్ల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే మార్గం
- పార్లమెంటరీ వ్యవస్థలో ఆవిష్కరణలు, సంస్కరణలకు ప్రాధాన్యం
- ప్రజాస్వామ్య సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం అవసరం
- అంతర్జాతీయ సహకారంపై చర్చలకు బ్రిక్స్ ఫోరమ్ వేదిక
- సభ్య, భాగస్వామ్య దేశాల ప్రతినిధుల హాజరు

సభ్య దేశాల ప్రతినిధులతో ప్రధాని మోదీ భేటీ



## హేట్ స్పీచ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

- భావప్రకటన, పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగే ప్రమాదం
- బిల్లులోని పదాలకు స్పష్టమైన నిర్వచనాలు లేవు
- రాజకీయ విమర్శలపైనా కేసులు పెట్టే అవకాశం
- అరెస్టు అధికారాల దుర్వినియోగంపై బీఆర్ఎస్ ఆందోళన
- బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణకు 30 రోజుల గడువు ఇవ్వాలి
- తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో బిల్లు అందుబాటులో ఉంచాలి

## క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ



- రాహుల్‌కు కోర్టులో ఊరట
- తీర్పును స్వాగతించిన కాంగ్రెస్
- గాంధేయ మార్గంలో బీజేపీపై పోరు
- ఫిర్యాదుదారుడి అర్హతపై అభ్యంతరం
- ఎనిమిదేళ్ల కేసుకు ముగింపు
- అమిత్ షాపై వ్యాఖ్యలతో వివాదం
- కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

## తెలంగాణలో వడ్లకు

# రికార్డు ధర

- క్వింటాల్‌కు రూ. 5,000 దాటిన రేటు!
- తెలంగాణలో వడ్లకు రికార్డు స్థాయిలో ధరలు
- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాలు జై శ్రీరామ్ వడ్లు రూ. 5,016
- సాగు తగ్గడం, పొరుగు రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడమే కారణం
- ప్రభుత్వ మద్దతు ధరను మించిపోవడంతో పౌరసరఫరాల శాఖకు సవాల్
- రిటైల్ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ. 100కు చేరిక



హైదరాబాద్

తెలంగాణ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ సిరుల పంట పండిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో వరి ధాన్యానికి ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకం వడ్లు ఏకంగా క్వింటాలుకు రూ. 5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయి. రాష్ట్రవ్యాప్తంగా నల్గొండ, కరీంనగర్, ఖమ్మం వంటి జిల్లాల్లో సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 3,000 నుంచి రూ. 3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు గతేడాదితో - మిగతా3లో

## సర్ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నాం

- ఫారం-6ను సవరించలేదు'.. సుప్రీంకోర్టులో ఈసీ అఫిడవిట్
- ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్ణయాలన్నీ ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా తీసుకున్నారు
- ఫారం- 6 ను కూడా సవరించలేదని వివరణ..
- అభిప్రాయాలు, ఆలోచనలన్నీ తుది నిర్ణయాలు కావు!



# సర్ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నాం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలు అన్నింటినీ ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగానే తీసుకున్నారని భారత ఎన్నికల సంఘం సుప్రీం కోర్టుకు తెలిపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చింది. ఇదే సమయంలో సర్ ఉత్తర్వుల ద్వారా ఓటరు నమోదు కోసం ఉపయోగించేటువంటి ఫారం- 6 ను కూడా సవరించలేదని స్పష్టం చేసింది. సీఈసీ పనితీరు, ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాల చట్టబద్ధతను సవాలు చేస్తూ రాకేశ్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానంగా ఈసీ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ దాఖలు చేసిన ఈ అఫిడవిట్‌కు సీఈసీతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కూడా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ప్రచురించిన రిపోర్ట్ ప్రకారం- సర్ ప్రక్రియకు సంబంధించి 14 కీలక నిర్ణయాలు తీసుకునే సమయంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆరోపణలు వచ్చాయి. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి 2025 జూన్ 24, 2025 అక్టోబర్ 27, 2026 మే 14 తేదీల్లో జారీ చేసిన మూడు ఉత్తర్వులు కమిషన్ ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ తన తాజా అఫిడవిట్‌లో స్పష్టం చేసింది.




**అభిప్రాయాలు, ఆలోచనలన్నీ తుది నిర్ణయాలు కావు!**

ఫైళ్ల పరిశీలన సమయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఇతర కమిషనర్లు వ్యక్తపరిచే అభిప్రాయాలు, ప్రశ్నలు, సూచనలు, వ్యాఖ్యలను మాత్రమే కమిషన్ తుది నిర్ణయాలుగా పరిగణించలేమని ఈసీ వివరించింది. సాధారణంగా ఒక ఫైల్ ముందుగా ఒక ఎన్నికల కమిషనర్ వద్దకు, ఆ తర్వాత రెండో కమిషనర్ దగ్గరికి, చివరికి సీఈసీ వద్దకు వెళ్తుందని పేర్కొంది. 2023లో రూపొందించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం, సర్వీస్ నిబంధనలు, పదవీ కాలానికి సంబంధించిన చట్టంలోని సెక్షన్ 18 ను కూడా ఈసీ ఈ సందర్భంగా ప్రస్తావించింది. దీని ప్రకారం- సాధ్యమైనంత వరకు నిర్ణయాలను ఏకగ్రీవంగా తీసుకోవాలని, అలా సాధ్యం కాకపోతే మెజార్టీ ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చని ఎన్నికల సంఘం- సుప్రీం కోర్టుకు తెలిపింది. ఇంకా పిటిషన్‌లోని ఆరోపణలు ప్రధానంగా వార్తా పత్రిక కథనాన్ని ఆధారంగా చేసుకున్నవేనని, పిటిషనర్ సంబంధిత అధికారులతో స్వతంత్రంగా వాస్తవాలను నిర్ధరించుకోలేదని కమిషన్ వాదించింది. అందువల్ల ఈ పిటిషన్ అసలు విచారణకే అర్హత పొందాల్సింది కాదని, ఇంకా తాము అంతర్గత ఫైల్స్ లేదా నోట్స్‌ను మీడియాకు కూడా విడుదల చేయలేదని వెల్లడించింది. కాబట్టి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరిన పిటిషన్ చట్టబద్ధంగా నిలబడదని ఈసీ వాదించింది.

**ఫారం- 6 ను కూడా సవరించలేదు**

ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చడానికి ఉపయోగించే ఫారం- 6 ను సర్ ఉత్తర్వుల ద్వారా సవరించారన్న ఆరోపణలను కూడా ఎన్నికల సంఘం ఖండించింది. అయితే ఓటరు నమోదు నిబంధనలు, 1960 కింద నిర్దేశించిన ఫారంలో మార్పులు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉంటుందని వివరించింది. సర్ ఉత్తర్వుల సమయంలో తాము కోరిన డిక్లరేషన్ ఒక ప్రత్యేక డాక్యుమెంట్ మాత్రమేనని, దానినే ఫారం- 6 ను సవరించినట్లుగా పరిగణించవద్దని తెలిపింది. గతంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితాలతో తమకు లేదా తమ తల్లిదండ్రులు, తాత ముత్తాతలకు ఉన్న సంబంధాన్ని వివరించాలని దరఖాస్తుదారులను కోరడం వివాదానికి కారణమైంది. ఈ మార్పులపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు తెలిపారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రచురించింది. అయితే ఇక్కడ ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రాసెస్‌లో డిక్లరేషన్‌ను చూపించిన తీరు వల్ల ఫారం- 6 ను సవరించినట్లు భావించే అవకాశం ఉందని ఈసీ అంగీకరించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి 2026, అక్టోబర్ 21 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో ఫారం- 6, సర్ డిక్లరేషన్‌ను రెండు వేర్వేరు భాగాలుగా చూపిస్తామని తెలిపింది.

# దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యానికి పెద్దపీట

బ్రిక్స్ దేశాల మధ్య పార్లమెంటరీ సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై భారత్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల నుంచి వచ్చిన పార్లమెంటరీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. దిల్లీలోని సంవిధాన్ సదన్‌లో జరుగుతున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ ప్రారంభ సమావేశం అనంతరం ఈ భేటీ జరిగింది.

వివిధ దేశాలకు చెందిన పార్లమెంటు సభ్యులను ప్రధాని నరేంద్ర మోదీ సాదరంగా ఆహ్వానించారు. తర్వాత కొంతమంది సభ్యులతో ముచ్చటించిన మోదీ, పార్లమెంట్ భవన సముదాయంలో బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను ఉద్దేశించి ప్రసంగించిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, అంతర్జాతీయ వేదికలపై గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను బలంగా వినిపించాల్సిన బాధ్యత బ్రిక్స్ దేశాలపై ఉందన్నారు. సంస్కృతి, భాషా పరంగా వైవిధ్యాలు ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసమే బ్రిక్స్ దేశాలను ఐక్యంగా ఉంచుతోందని తెలిపారు. యుద్ధాలు, ఆర్థిక అస్థిరత, వాణిజ్య ఉద్రిక్తతలు, ఉగ్రవాదం వంటి సవాళ్లతో ప్రపంచం అనిశ్చితిని ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడానికి చర్చలు, దౌత్యం ఎంతో అవసరమని ఓంబిర్లా పేర్కొన్నారు.




**పార్లమెంటరీ వ్యవస్థలో ఆవిష్కరణలు అవసరం**

ప్రజాస్వామ్య సంస్థల పనితీరును మెరుగుపరచడంలో ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని లోక్‌సభ స్పీకర్ పేర్కొన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడమే ఆవిష్కరణ కాదని, కొత్త ఆలోచనలు, ప్రగతిశీల విధానాలు, సంస్థాగత సంస్కరణలు కూడా అందులో భాగమేనని వివరించారు. ఈ మార్పుల ద్వారా పార్లమెంటరీ వ్యవస్థను మరింత సమర్థంగా, పారదర్శకంగా, ప్రజల భాగస్వామ్యానికి అనుకూలంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. చర్చల నాణ్యతను పెంచడం, ప్రజలతో అనుసంధానాన్ని మెరుగుపరచడం, వారి మారుతున్న అంచనాలకు అనుగుణంగా స్పందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెరగాలంటే పార్లమెంట్లు పారదర్శకంగా పనిచేయడంతో పాటు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం**

యువత ఆశయాలు, ఆలోచనలు, సమస్యలను పార్లమెంట్లు శ్రద్ధగా వినాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. యువతలోని శక్తి, సృజనాత్మకత, నైపుణ్యాలను దేశ అభివృద్ధికి ఉపయోగపడేలా మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత పార్లమెంట్లపై ఉందని అన్నారు. వారి ఆశలు, ఆందోళనలను అర్థం చేసుకుని, విధాన రూపకల్పనలో యువత అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు కాలానుగుణంగా మారుతున్నందున పార్లమెంటరీ వ్యవస్థలు కూడా ఆ మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం కల్పించిన అధికారాలే ప్రజాస్వామ్య సంస్థల బలం కాదని, నిర్మాణాత్మక చర్చలు, ఏకాభిప్రాయ సాధన, పారదర్శకత, ప్రజలకు జవాబుదారీతనం కూడా అంతే ముఖ్యమని వివరించారు.

**పార్లమెంటరీ సహకారంపై చర్చలు**

బ్రిక్స్ దేశాల పార్లమెంటరీ నేతలు, ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ ఫోరమ్ పరస్పర సహకారాన్ని పెంపొందించడం, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంపై చర్చించేందుకు అవకాశం కల్పిస్తోంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

**పలు దేశాల ప్రతినిధుల హాజరు**

ఈ ఫోరమ్‌లో బ్రెజిల్, రష్యా, చైనా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇరాన్ వంటి బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. భాగస్వామ్య దేశాల నుంచి బెలారస్, క్యూబా, థాయ్‌లాండ్, ఉగాండా, వియత్నాం, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ ప్రతినిధులు హాజరయ్యారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్‌తో పాటు పలువురు పార్లమెంటు సభ్యులు కూడా విదేశీ ప్రతినిధులతో సమావేశమయ్యారు.

# రక్షణ రంగానికి భారీ బూస్ట్

**న్యూఢిల్లీ:** దేశ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ దళాల కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాల కొనుగోలు ప్రతిపాదనలకు రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కొనుగోళ్లలో తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు, దీర్ఘశ్రేణి కామికేజ్ డ్రోన్లు, ఆధునిక ఆయుధ వ్యవస్థలు, నిఘా పరికరాలు ఉన్నాయి.



**సైన్యం కోసం ఆధునిక ఆయుధ వ్యవస్థలు**

భారత సైన్యం కోసం అధిక చలనశీలత కలిగిన వాహనాలు, స్వయంచాలక ట్రాక్డ్ గన్ వ్యవస్థలు, గన్‌షాట్ రెస్పాన్స్ సిస్టమ్ (జీఎస్ఆర్ఎస్), తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు, అత్యల్ప శ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థలు (వీఎస్‌హెచ్ఓఆర్ఏడీఎస్), డ్రోన్లను ఎదుర్కొనే వ్యవస్థలు (సీ-యూఏఎస్) కొనుగోలుకు ఆమోదం లభించింది. అలాగే ఇతర డ్రోన్ వ్యవస్థలు, మానవరహిత వైమానిక నిఘా వ్యవస్థలు, సమీకృత నిఘా-దాడి వ్యవస్థలు, దీర్ఘశ్రేణి కామికేజ్ డ్రోన్ల కొనుగోలుకు కూడా డీఏసీ పచ్చజెండా ఊపింది. ఈ వాహనాలు కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో సైన్యం కదలికలను, రవాణా సామర్థ్యాలను మెరుగుపరచనున్నాయి. స్వయంచాలక ట్రాక్డ్ గన్ వ్యవస్థలు వేగంగా కదులుతూ కాల్పులు జరిపేందుకు ఉపయోగపడతాయి. గన్‌షాట్ రెస్పాన్స్ సిస్టమ్ యుద్ధరంగంలో కాల్పులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడంలో తోడ్పడుతుంది. తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లను భారత సైన్యం, వైమానిక దళం వినియోగించనున్నాయి. నిఘా, శోధన, రక్షణ చర్యలు, సైనికుల తరలింపు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి అవసరాలకు వీటిని ఉపయోగించవచ్చు. అత్యల్ప శ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థలు సమీప దూరంలో ఎదురయ్యే వైమానిక ముప్పులను అడ్డుకోవడానికి ఉపయోగపడతాయి. డ్రోన్లను గుర్తించి ఎదుర్కొనే వ్యవస్థలు సైనిక స్థావరాలు, యుద్ధ ట్యాంకులు, ఇతర కీలక రక్షణ వనరుల భద్రతను పెంచడంలో సహాయపడతాయి.

**నౌకాదళం కోసం క్షిపణి నిరోధక వ్యవస్థలు**

భారత నౌకాదళం కోసం యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ సిస్టమ్ (ఏఓడీఎస్)తో పాటు ఇతర కీలక నౌకాదళ పరికరాల కొనుగోలుకు కూడా ఆమోదం లభించింది. శత్రువుల నౌకా విధ్వంసక క్షిపణులను దారి మళ్లించి, నౌకలకు రక్షణ కల్పించడంలో ఏఓడీఎస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ వ్యవస్థ నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకల రక్షణ సామర్థ్యాలను మరింత పెంచనుంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి, నిర్మించనున్న నౌకాదళ పరికరాలు భారత నౌకాదళ పోరాట సామర్థ్యాలను బలోపేతం చేయనున్నాయి. దేశీయ సాంకేతిక పరిజ్ఞానానికి ప్రోత్సాహం లభించడంతో పాటు రక్షణ రంగంలో స్వావలంబన లక్ష్యానికి ఇవి దోహదపడనున్నాయి.

**వైమానిక దళానికి అధునాతన పరికరాలు**

భారత వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వైమానిక రక్షణ వ్యవస్థలు, ఆయుధాలు, మొబైల్ ఎక్స్-బ్యాండ్ డాప్లర్ వాతావరణ రాడార్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. హెలికాప్టర్లు వైమానిక రవాణా అవసరాలను తీర్చడంతో పాటు వివిధ కార్యాచరణల్లో ఉపయోగపడనున్నాయి. ఎక్స్-బ్యాండ్ డాప్లర్ వాతావరణ రాడార్లు సరిహద్దు, వ్యూహాత్మక ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని అందించనున్నాయి. దీనివల్ల వైమానిక కార్యకలాపాల ప్రణాళిక, నిర్వహణ మరింత సమర్థంగా సాగేందుకు అవకాశం ఉంటుంది.

**దేశీయ పరిశ్రమలకు ప్రాధాన్యం**

రక్షణ పరికరాల కొనుగోళ్లలో స్వదేశీ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం ఆమోదించిన కొనుగోళ్లలో సుమారు 82 శాతం విలువైన పరికరాలను భారతీయ పరిశ్రమల నుంచే సమకూర్చుకోనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నిర్ణయం దేశీయ రక్షణ తయారీ రంగానికి ఊతమివ్వడంతో పాటు, ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానంలో విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా దోహదపడనుంది. సైన్యం, నౌకాదళం, వైమానిక దళాల అవసరాలకు అనుగుణంగా ఆధునిక పరికరాలను సమకూర్చుకోవడం ద్వారా దేశ రక్షణ సామర్థ్యాలను మరింత పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

## క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ



పరువు నష్టం కేసులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించడంతో బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది కాంగ్రెస్. బీజేపీని నేరస్థులు నడిపే పార్టీగా అభివర్ణించింది. గాంధేయ మార్గంలో పోరాడి, ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఓడిస్తామని పేర్కొంది. బీజేపీ నేత అమిత్ షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై నమోదైన పరువు నష్టం కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు నిర్దోషిగా సోమవారం ఉదయం ప్రకటించగా, ఆ తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. నిజం గెలిచిందని పేర్కొంది. బీజేపీ అధికారంలోకి రావడానికి నేరాలకు పాల్పడిన వారిని ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఆ పార్టీని ఓడించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే ఆ పోరాటం హింసకు తావులేకుండా మహాత్మా గాంధీ చూపిన మార్గంలోనే సాగుతుందని చెప్పారు. ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఎదుర్కొంటామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 2018లో చేసిన వ్యాఖ్యల్లో పరువు నష్టం కలిగించే అంశం లేదని కోర్టు స్పష్టం చేసిందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. అమిత్ షాను వ్యక్తిగతంగా కించపరచాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని రాహుల్ తరఫున హాజరైన న్యాయవాది వాదించారు. "ఈ కేసులో రాహుల్ గాంధీ నిర్దోషిగా విడుదలయ్యారు. ఫిర్యాదుదారునికి దావా వేసేందుకు చట్టపరమైన అర్హత లేదని కోర్టు నిర్ధారించింది. రాహుల్ గాంధీ నిర్దోషిగా తేలడం పట్ల ప్రస్తుతం మా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాం. తీర్పు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించలేదు. ఈ కేసును కొట్టివేయడానికి గల నిర్దిష్ట కారణాలు లేదా ప్రాతిపదిక ఏమిటో, పూర్తి తీర్పు ప్రతిని చూసిన తర్వాతే చెప్పగలము" అని రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా అన్నారు. తాజాగా ఆ కేసులో విచారణ పూర్తి చేసిన సుల్తాన్‌పుర్ ప్రత్యేక కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుభమ్ వర్మ తీర్పు వెలువరించారు. కోర్టు నిర్ణయంతో ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆ కేసుకు ముగింపు లభించింది. తీర్పు వెలువడిన సమయంలో రాహుల్ గాంధీ కోర్టులోనే ఉన్నారు. అనంతరం ఆయన బయటకు రాగానే కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. డప్పులు కొడుతూ, మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. 'సత్యమేవ జయతే' అంటూ నినాదాలు చేశారు. కోర్టు తీర్పు తమ వాదనకు బలం చేకూర్చిందని కాంగ్రెస్ భావిస్తోంది. అదే సమయంలో బీజేపీపై రాజకీయ విమర్శలను మరింత గట్టిగా వినిపించింది. 2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వివాదం మొదలైంది. ఆ సమయంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. బెంగళూరులో జరిగిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారని వ్యాఖ్యానించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు అమిత్ షా ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ సుల్తాన్‌పుర్‌కు చెందిన బీజేపీ నేత విజయ్ మిశ్రా కోర్టును ఆశ్రయించారు. 2018 ఆగస్టు 4న విజయ్ మిశ్రా పరువు నష్టం ఫిర్యాదు దాఖలు చేశారు. ఆ కేసులో రాహుల్ గాంధీ 2023లో కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. అనంతరం కేసు విచారణ కొనసాగింది. రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఫిర్యాదుదారుడు తప్పుబట్టగా, వాటిని సందర్భం నుంచి విడదీసి చూస్తున్నారని కాంగ్రెస్ నేత తరఫు న్యాయవాదులు వాదించారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ మరోసారి విమర్శలు గుప్పించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల మార్గాలను ఉపయోగిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఓటు చోరీకి సంబంధించి అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయని ఖర్గే అన్నారు. అయినప్పటికీ జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణ కల్పించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద కోరితే, ఎన్నికల సంఘం వాణిజ్య రహస్యాలు అనే కారణంతో సమాధానం ఇవ్వడానికి నిరాకరించిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పారదర్శకత అవసరమని డిమాండ్ చేస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 16.18 లక్షల ఫామ్-6 దరఖాస్తులకు సంబంధించిన వివరాలను బహిరంగంగా వెల్లడించలేదని ఆరోపించారు. పిలిభిత్ జిల్లాలో 10,470 మంది ఓటర్ల రికార్డుల్లో అవకతవకలు గుర్తించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 దరఖాస్తులపై విచారణకు ఆదేశించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ఓటరు జాబితాల్లో కొత్తగా పేర్లు చేర్చడం, తొలగించడం, వివరాల్లో మార్పులు చేయడం వంటి ప్రక్రియల్లో ఈ ఫారాలు కీలక పాత్ర పోషిస్తాయి.

**మూడు ప్రధాన డిమాండ్లు**

బీజేపీకి, ఎన్నికల సంఘానికి మధ్య కుమ్మక్కు ఉందన్నది ఇండియా కూటమి ఆరోపణ అని ఖర్గే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మూడు ప్రధాన డిమాండ్లను ముందుకు తెచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి. ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పించే 2023 చట్టాన్ని రద్దు చేయాలి. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. అక్రమంగా తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలి. అన్ని ఎన్నికలను పేపర్ బ్యాలెట్ల ద్వారా నిర్వహించాలని కూడా ఖర్గే డిమాండ్ చేశారు. ఈ పోరాటం కేవలం ఓట్ల పరిరక్షణకే పరిమితం కాదని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రజా ఉద్యమమని వ్యాఖ్యానించారు.

**భారీ ర్యాలీకి పిలుపు**

ఓట్ చోరీకి వ్యతిరేకంగా నవంబర్ 1న దిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఖర్గే పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

**మన్ కీ బాత్‌ను పక్కన పెట్టండి : జైరాం రమేశ్**

మరోవైపు, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయంటూ ప్రధాని మోదీని కాంగ్రెస్ లక్ష్యంగా చేసుకుంది. దీపావళికి ముందు ఆహార పదార్థాలు, డ్రై ఫ్రూట్స్ ధరలు పెరగడం సామాన్య కుటుంబాల బడ్జెట్‌పై ప్రభావం చూపుతోందని జైరాం రమేశ్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ను ప్రస్తావించిన ఓ మీడియా కథనాన్ని ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. కొన్ని ఆహార పదార్థాల ధరలు నిరంతరం పెరుగుతున్నాయని, దీంతో కుటుంబాల ఖర్చులు అధికమవుతున్నాయని ఆ కథనం పేర్కొన్నట్లు తెలిపారు. మరో కథనాన్ని ఉటంకిస్తూ పిస్తా, బాదం, జీడిపప్పు, యాలకుల ధరలు కూడా పెరిగాయని వెల్లడించారు.

**ఉల్లిపాయలు, చక్కెర ధరల పెరుగుదలపై విమర్శలు**

ప్రభుత్వ గణాంకాల ప్రకారం ద్రవ్యోల్బణం పెరుగుతోందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. గత నాలుగు నెలల్లో ఉల్లిపాయల ధరలు 85 శాతం, చక్కెర ధరలు 34 శాతం పెరిగాయని ఆయన తెలిపారు. గత నెలలోనే టమాటాల ధరలు 8.5 శాతం, కందిపప్పు ధరలు 3.5 శాతం, శనగపప్పు ధరలు 3.1 శాతం పెరిగాయని పేర్కొన్నారు. దీపావళికి ముందు కిలో బాదం ధర రూ.1,300కు చేరిందని, పచ్చి యాలకుల ధర కిలోకు రూ.300 మేర పెరిగిందని ఆయన ఆరోపించారు. ఈ ధరల పెరుగుదలతో పండుగ జరుపుకోవాలా? కుటుంబ ఖర్చులను ఎలా నిర్వహించాలా? అనే సందిగ్ధంలో సగటు కుటుంబాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

# తుమ్మిడిహెట్టికి అభ్యంతరం లేదు.. కమిటీ వేయండి

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కేంద్ర జలసంఘం అధ్యయనంతో పాటు రెండు రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ అన్ని అంశాలను పరిశీలించాలని ప్రతిపాదించారు. ముంపు, ప్రభావిత ప్రాంతానికి సంబంధించి ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్ వేదికగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## ఫడణవీస్ హామీ ఇచ్చారు

తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంపు అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్?తో చర్చలు చాలా ఫలవంతంగా ముగిశాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఎక్స్ వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి తమ ప్రతిపాదనను పెద్ద హృదయంతో పరిశీలించారని ఫడణవీస్?కు కృతజ్ఞతలు చెప్పారు. సాంకేతిక అంశాలతో పాటు ముంపు అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీ ఏర్పాటు చేసేందుకు ఇరువైపులా అంగీకారం కుదిరిందని అన్నారు. మహారాష్ట్ర, అక్కడి ప్రజల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుంటూనే జాతీయ దృక్పథంతో ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ప్రత్యేకించి గిరిజనుల జీవితాలను మార్చేందుకు తన వంతు సహకరిస్తానని ఫడణవీస్ హామీ ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిపాదనలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు.

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి

రాష్ట్ర ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. సమావేశం ప్రారంభంలో ప్రజెంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన ఆయన సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను పేర్కొన్నారు. ఆదిలాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి లేదని తెలిపారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును



148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందన్న ఆయన ఆ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని వివరించారు.

## 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట

ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమని, గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అక్కడ అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. వెనుకబడిన అటవీ ప్రాంతమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పేర్కొన్నారు. కుమురం భీం సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాట కాలం నుంచి ఆ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.

## గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు

దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదన్న రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నా సీఎం రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందని తెలిపారు. వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్న ఆయన పరస్పర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. రాష్ట్ర ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన దేవేంద్ర ఫడణవీస్ తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోమారు పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని మహారాష్ట్ర సీఎం తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.

## ప్రతికూల ప్రభావం లేకపోతే

మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదని ఫడణవీస్ తెలిపారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట విషయంలో కేంద్ర జలసంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందని అన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలని అన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించి ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు.

## గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానం

దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్?లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్?ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన ఫడ్నవీస్ సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

# హేట్ స్పీచ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన హేట్ స్పీచ్ బిల్లును ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. బిల్లులోని పలు నిబంధనలు రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, రాజకీయ విమర్శలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు శాసనసభ సెలక్ట్ కమిటీ ఛైర్మన్?కు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ సవివరమైన మెమోరాండం సమర్పించారు.

## స్పష్టమైన నిర్వచనాలు లేవు

హేట్ స్పీచ్, హేట్ క్రైమ్స్‌ను నిరోధించడంలో తమ పార్టీకి అభ్యంతరం లేదని స్పష్టం చేసిన బీఆర్ఎస్ హింసకు ప్రేరేపించే ప్రసంగాలు, వ్యక్తులపై దాడులను అరికట్టేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని పేర్కొంది. అయితే, బిల్లులోని నిర్వచనాలు విస్తృతంగా ఉండటం, నేర నిర్ధారణకు స్పష్టమైన ప్రమాణాలు లేకపోవడం, అధికారులకు విస్తృత అధికారాలు కల్పించడం వల్ల చట్టం దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లులోని 'హేట్ స్పీచ్', 'శత్రుత్వం', 'ద్వేషం', 'అసౌకర్యం కలిగించే వ్యాఖ్యలు' వంటి పదాలకు స్పష్టమైన నిర్వచనాలు లేవని అభ్యంతరం తెలిపింది. రాజకీయ విమర్శలు, ప్రభుత్వ విధానాలపై అసమ్మతి, మీడియా కథనాలు, ప్రజా సమస్యలపై చర్చలను కూడా నేరాల పరిధిలోకి తీసుకొచ్చే ప్రమాదం ఉందని పేర్కొంది. కేవలం విమర్శాత్మక వ్యాఖ్యలు చేసినంత మాత్రాన వాటిని నేరంగా పరిగణించకూడదని, హింసకు ప్రేరేపించే ఉద్దేశం, నిర్దిష్ట సందర్భం, వాస్తవమైన హాని జరిగే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ సూచించింది.

## దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించాల్సిన అవసరాన్ని బీఆర్ఎస్ పేర్కొంది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను ప్రస్తావించిన ఆ పార్టీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు, రాజకీయ అసమ్మతిని వ్యక్తం చేసే స్వేచ్ఛ కీలకమని పేర్కొంది. బిల్లులో ప్రతిపాదించిన శిక్షలు, అరెస్టు అధికారాలు, ముందస్తు నిరోధక చర్యలపై కూడా బీఆర్ఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. కొన్ని నిబంధనల ప్రకారం నాన్ బెయిలబుల్ నేరాలు, వారెంట్ లేకుండా అరెస్టు చేసే అవకాశం, ముందస్తు నిరోధక ఆదేశాలు అమలులోకి వస్తే అవి రాజకీయ ప్రత్యర్థులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలపై దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రభుత్వ అధికారుల విచక్షణాధికారాలకు పరిమితులు ఉండాలని, అరెస్టులకు స్పష్టమైన కారణాలు, న్యాయపరమైన పర్యవేక్షణ తప్పనిసరి చేయాలని సూచించింది. తప్పుడు లేదా రాజకీయ ప్రేరేపిత ఫిర్యాదులకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల హక్కులను కాపాడాలని పేర్కొంది.

## 30 రోజుల గడువు ఇవ్వాలి

హేట్ స్పీచ్ బిల్లును యథాతథంగా ఆమోదించకుండా ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ కోరింది. ఒకవేళ బిల్లును కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తే, అందులో సమగ్ర మార్పులు చేయాలని సూచించింది. హింసకు ప్రేరేపించే ఉద్దేశంతో కూడిన ప్రసంగాలకే చట్టాన్ని పరిమితం చేయడం, హేట్ స్పీచ్‌ను ఇతర నేరాల నుంచి స్పష్టంగా వేరు చేయడం, అరెస్టులు, నిరోధక చర్యలకు న్యాయపరమైన రక్షణ కల్పించడం వంటి ప్రతిపాదనలను బీఆర్ఎస్ పార్టీ చేసింది. బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణకు కనీసం 30 రోజుల గడువు ఇవ్వాలని కోరింది. తెలుగు, ఉర్దూతో పాటు ఆంగ్లంలోనూ బిల్లును అందుబాటులో ఉంచాలని జర్నలిస్టులు, న్యాయ నిపుణులు, పౌర సమాజ ప్రతినిధులు, సాంకేతిక రంగ నిపుణుల అభిప్రాయాలను సెలెక్ట్ కమిటీ సేకరించాలని విజ్ఞప్తి చేసింది.

# అర్నాబ్ తుపాను ప్రభావం - తెలంగాణకు భారీ వర్ష సూచన

వర్షాలు లేక ఎండిపోతున్న పంటలు చూసి అల్లాడుతున్న రైతులకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుభవార్త చెప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో రేపు, ఎల్లుండి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. రేపు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమ కొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

## పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ

ఎల్లుండి ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్ బాద్ జిల్లాల్లో అతిభారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు వాతావరణ శాఖ



ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.

## ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటే అవకాశం

అర్నాబ్ తుఫాను సాయంత్రానికి పశ్చిమ మధ్య బంగాళా ఖాతంలో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉంది. అనంతరం, రేపటికి అదే ప్రాంతంలో అతి తీవ్ర తుఫానుగా బలపడే అవకాశం ఉంది. ఆ తరువాత ఈ తుఫాను వాయువ్య దిశగా కదులుతూ, ఎల్లుండి ఉదయం నుంచి మధ్యాహ్నానికి ముందు సమయంలో ఏపీలోని బాపట్ల, విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో ఇది అతి తీవ్ర తుఫానుగా ఉండే అవకాశం ఉంది. ఆ సమయంలో గరిష్ఠంగా నిరంతర గాలుల వేగం గంటకు 115--125 కి.మీ. ఉండవచ్చు. గాలుల వేగం అప్పుడప్పుడు గంటకు 140 కి.మీ. వరకు పెరిగే అవకాశం ఉంది.

## అప్రమత్తమైన టీజీఎస్‌పీడీసీఎల్

తుఫాను ప్రభావంపై టీజీఎస్‌పీడీసీఎల్ అప్రమత్తమైంది. అత్యవసర మరమ్మతులకు సిబ్బంది, సామగ్రి సిద్ధం చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి.పాటిల్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. తుఫాను ప్రభావంతో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎండీ జితేశ్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయకుండా, అత్యవసర విధులకు అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలను వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది, వాహనాలు, మరమ్మతు సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తంగా ఉంచి క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో వేగంతో పాటు భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకవద్దని, వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ అంతరాయాలపై ఫిర్యాదుల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్?ను సంప్రదించాలని సూచించారు.

# మాకూ కావాలి ఓ జాబ్ కార్డు!

**హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు, వ్యవసాయ పనులు తగ్గుతాయన్న ఆందోళన గ్రామీణ ప్రజలను ఉపాధి హామీ పనుల వైపు మళ్లిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం జీరాంజీ పథకం కింద కొత్త జాబ్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టింది. ఈ ప్రక్రియకు గ్రామీణ కుటుంబాల నుంచి స్పందన లభిస్తోంది. ఈ నెల ప్రారంభం నుంచి కొత్త జాబ్ కార్డుల కోసం 2,25,302 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో ఇప్పటివరకు 39,188 కుటుంబాలకు కార్డులు జారీ చేసినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీటి ద్వారా 1,90,184 మంది లబ్ధి పొందనున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగు తగ్గితే వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం కష్టమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. యాసంగి సాగుపైనా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో గ్రామీణులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడంపై దృష్టి సారించింది.

## కొత్త కార్డుల కోసం భారీగా దరఖాస్తులు

18 ఏళ్లు నిండినా ఇప్పటివరకు జాబ్ కార్డులు పొందని వారికి కొత్తగా కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు గ్రామాల్లో చాటింపు వేయించి పంచాయతీ కార్యదర్శుల ద్వారా దరఖాస్తులను ఆహ్వానించారు. రాష్ట్రంలోని 12,760 గ్రామాల నుంచి 2,25,302 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇప్పటివరకు జారీ చేసిన కార్డుల్లో నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 2,800 కుటుంబాలకు కార్డులు అందినట్లు సమాచారం. ఆదివాసీ, గిరిజన కుటుంబాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. దీంతో ఆయా ప్రాంతాల్లో కొత్త కార్డుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కొత్తగా జారీ చేస్తున్న కార్డులతో కలిపి రాష్ట్రంలో ప్రస్తుతం 52,51,582 కుటుంబాలకు చెందిన సుమారు 1.02 కోట్ల మంది జాబ్ కార్డులు పొందినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

## ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్

జీరాంజీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులను విస్తృతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కూలీల సమీకరణ, పనుల కేటాయింపు, పనుల నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు నిర్ణయించాయి. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో మేట్లను ఎంపిక చేయాలని జిల్లాల గ్రామీణాభివృద్ధి అధికారులకు ఆదేశాలు జారీ చేశాయి. ప్రస్తుతం గ్రామాల్లో కూలీలను గుర్తించడం, పనులకు తీసుకెళ్లడం వంటి బాధ్యతలను క్షేత్ర సహాయకులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ అర్హులైన వారందరికీ అవసరమైన స్థాయిలో ఉపాధి అందడం లేదని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో మేట్ల నియామకంతో పనుల నిర్వహణను మరింత సమర్థంగా చేపట్టాలని నిర్ణయించారు. ఎంపిక చేసిన మేట్ల వివరాలను జిల్లాల వారీగా నివేదించాలని, వారి విధులు, బాధ్యతలపై మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో శిక్షణ ఇవ్వాలని అధికారులు సూచించారు.

## వర్షాభావ పరిస్థితులతో ఉపాధిపై ఆశలు

ఈ సీజన్‌లో తగిన వర్షాలు కురవకపోతే వ్యవసాయ పనులకు ఆటంకం కలగడంతో పాటు భూగర్భ జలమట్టాలు పడిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణ కుటుంబాలకు ఉపాధి హామీ పనులు కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో జీరాంజీ పథకాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి పని దినాలు 25 శాతం పెరగడం, అదనంగా 95 రకాల పనులను చేర్చడం గ్రామీణ కూలీలకు కొంత మేర ప్రయోజనం కలిగించే అవకాశముంది. కొత్త జాబ్ కార్డుల జారీ, మేట్ల నియామకం, పనుల విస్తరణ ద్వారా అర్హులైన కుటుంబాలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది

# తెలంగాణలో వడ్లకు రికార్డు ధర..

-మొదటిపేజీ తరువాయి

పోలిస్తే సుమారు 14 శాతం తగ్గడం, ఎల్ నినో ప్రభావం వంటి కారణాలతో దిగుబడిపై అంచనాలు మారాయి. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండటంతో బహిరంగ మార్కెట్‌లో పోటీ పెరిగింది. ఫలితంగా, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

## ప్రభుత్వానికి సవాల్.. వినియోగదారులపై భారం

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధర ప్రకటించగా, ఎంపిక చేసిన 7 సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తోంది. దీంతో ప్రభుత్వానికి అమ్మితే రైతుకు గరిష్ఠంగా రూ. 2,961 లభిస్తుంది. అయితే, బహిరంగ మార్కెట్‌లో రూ. 3,500 ధర పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపు చూడటం లేదు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థ (రాణా) కోసం సన్న బియ్యాన్ని సేకరించాలనుకుంటున్న ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. మరోవైపు, ఈ ధరల పెరుగుదల ప్రభావం సామాన్య వినియోగదారులపై పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న రకం బియ్యం కిలో ధర రూ. 90 నుంచి రూ. 100కి చేరింది.

## రైతుల హర్షం.. ప్రభుత్వ స్పందన

"వరికి ఒక్కసారిగా ఇంత ధర పెరుగుతుందని అనుకోలేదు. పెరిగిన ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది" అని ఓ రైతు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, సన్న రకం బియ్యం ధరల పెరుగుదలకు ఎల్ నినో ప్రభావమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో తాను సన్న రకం వరి సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ ఇప్పుడు దాని ప్రయోజనం రైతులకు అందుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 'జై శ్రీరామ్' రకంతో పాటు, ఆర్ఎన్ఆర్ వంటి ఇతర సన్న రకాలకు కూడా క్వింటాలుకు రూ. 4,300 వరకు ధర పలుకుతోంది. రాబోయే నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతలు పూర్తిస్థాయికి చేరిన తర్వాత ధరల తీరు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# కొడంగల్‌లోని రేడియల్ రోడ్డు నిర్మాణానికి చకచకా అడుగులు

కొడంగల్ నియోజకవర్గంలో రేడియల్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో నిర్మించనున్న ఈ 81 కిలోమీటర్ల పొడవైన రహదారి బుద్వేల్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి ప్రారంభమై షాబాద్, పరిగి, దోమ మండలాల మీదుగా దుద్యాల మండలంలోని హకీంపేటను కలుపుతూ నాచారం వరకు సాగనుంది. 75 మీటర్ల వెడల్పుతో 6 లేన్ల రహదారిగా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే దుద్యాల మండలంలోని హకీంపేట, పోలేపల్లిలో 99 ఎకరాలు అలాగే పరిగి నియోజకవర్గంలో మరో 400 ఎకరాల భూమిని సేకరించారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.3,295 కోట్లు వెచ్చించనున్నారు. ఈ రహదారి నిర్మాణ బాధ్యతలను హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్?ఎండీఏ)కి అప్పగించారు. ఏడాదిన్నర కాలంలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నవంబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్?ఆర్?ఆర్?) రెండూ కొడంగల్ నియోజకవర్గానికి అనుసంధానం కానున్నాయి.

## మల్టీపర్పస్ ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు శ్రీకారం

ఈ ప్రాంత అభివృద్ధిలో భాగంగా దుద్యాల మండలంలో సుమారు 1,300 ఎకరాల విస్తీర్ణంలో మల్టీపర్పస్ ఇండస్ట్రీయల్ కారిడార్‌ను ఏర్పాటు చేసే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పరిగి మండలంలోని రాపోల్, కాండ్లాపూర్‌లో ఇండస్ట్రీయల్ పార్కు, షాబాద్ మండలంలో కారిడార్, దోమ మండలంలో అందుబాటులోకి రానున్న పారిశ్రామిక జోన్‌ను దృష్టిలో ఉంచుకొని దీన్ని నిర్మిస్తున్నారు. శంషాబాద్ ఎయిర్?పోర్టు నుంచి కనెక్టివిటీ ఉండటంతో ఇక్కడి పరిశ్రమలకు అవసరమైన ముడిసరకు సులభంగా, వేగంగా చేరనుంది.

## మూడు జిల్లాలను కలుపుతూ

జాతీయ రహదారి 167ను కలుపుతూ మూడు జిల్లాల గుండా వెళ్లేలా కొత్త రహదారిని నిర్మించనున్నారు. రంగారెడ్డి జిల్లాలోని బుద్వేల్ నుంచి షాబాద్, కొందుర్గు, పరిగి, చౌదరిగూడెం, దోమ మండలాల మీదుగా సాగుతూ దుద్యాల మండలంలోని పోలెపల్లి, హకీంపేటలను కలుపుతూ, నారాయణపేట జిల్లాలోని కోస్గి మండలం నాచారం వరకు సాగనుంది.

# పెద్దపల్లి యువతకు శుభవార్త

**రూ.70 కోట్లతో విద్యారంగ అభివృద్ధి,**
**టాస్క్ కేంద్రం ద్వారా 2600 మందికి ఉద్యోగాలు –**
**ప్రభుత్వ విప్ విజయ రమణారావులి**





**పెద్దపల్లి, అక్టోబర్ 26 (అగ్నిధార):**

జిల్లాలోని యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.

సోమవారం పెద్దపల్లిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.27 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల రెనోవేషన్ పనులను, రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలోని యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పెద్దపల్లిలో టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా శిక్షణ పొందిన అనేక మంది యువత ఇప్పటికే ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. టాస్క్ కేంద్రం ద్వారా ఇప్పటివరకు కల్పించిన ఉద్యోగ అవకాశాలు, సాధించిన పురోగతికి సంబంధించిన వివరాలతో వారం రోజుల్లో శ్వేతపత్రం విడుదల చేస్తామని వెల్లడించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని ఆయన తెలిపారు. పాఠశాలల పునరుద్ధరణ, అదనపు తరగతి గదుల నిర్మాణం తదితర పనులు చేపడుతున్నామని, కేవలం పెద్దపల్లి మండలంలోనే సుమారు రూ.14 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, ఈ విద్యా సంవత్సరంలో పెద్దపల్లి మండలంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన చర్యల ఫలితంగా గతంలో విద్యా ఫలితాల్లో 32వ స్థానంలో ఉన్న పెద్దపల్లి జిల్లా ప్రస్తుతం 8వ స్థానానికి చేరుకుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా సుమారు రూ.800 కోట్ల వ్యయంతో అల్పాహార పథకాన్ని అమలు చేస్తోందని, హరే రామ ట్రస్ట్ సహకారంతో అమలవుతున్న ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారని తెలిపారు. విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ దశ అత్యంత కీలకమని, ఈ సమయంలో అనేక ఆలోచనలు, ఆకర్షణల వల్ల చదువుపై దృష్టి మరలే అవకాశం ఉంటుందని, అధ్యాపకులు విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన మార్గంలో నడిపించాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో ముఖ్యమని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

గత మూడేళ్లలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గణనీయమైన మార్పులు వచ్చాయని, ఇటీవల నాలుగు అవార్డులు లభించాయని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ అద్దె ద్వారా వచ్చే ఆదాయం నేరుగా కళాశాలకు చేరేలా, అదేవిధంగా ఆసుపత్రుల వద్ద ఉన్న షట్టర్ల ఆదాయాన్ని ఆసుపత్రుల అవసరాలకు వినియోగించేలా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారని వివరించారు.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,.**

విద్యారంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు విద్యా ప్రమాణాలు, పరీక్షా ఫలితాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు. ప్రస్తుత ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు టాస్క్ కేంద్రం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని, గత ఏడాదిన్నర కాలంలో సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని వివరించారు. ఉద్యోగాలు కల్పించడంతోనే బాధ్యత ముగియదని, ఉద్యోగాల్లో చేరిన యువతకు మూడు నెలల పాటు ఫాలోఅప్ నిర్వహిస్తూ వారు ఉద్యోగాల్లో కొనసాగుతున్నారా, వేతనాలు సక్రమంగా అందుతున్నాయా అనే అంశాలను పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.

# ప్రభుత్వ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్..

**ఓట్ల తొలగింపు అనేది అనైతిక చర్య..**
**ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎన్ని నీళ్లు ఇచ్చారో కేటీఆర్ చెప్పాలి..**
**బిఆర్ఎస్ కట్టిన బ్యారేజీలన్ని లీకేజీలే...**
**సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ దిమాకు లేని మాటలు...**
**రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..**



**అగ్నిధార న్యూస్ పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్స్ లో ఏఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా చేపట్టిన " ఓట్ బచావో – దేశ్ బచావో " ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమ ఏఐసిసి పరిశీలకులు ఎస్. శరత్ , టీపీసీసీ పరిశీలకులు కూన శ్రీశైలం గౌడ్ డీసీసీ అధ్యక్షులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ర్లతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..**

ఎస్.ఐ.ఆర్ పేరుతో చీఫ్ ఎలక్షన్ కమిషన్ జ్ఞానేశ్ కుమార్ అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో కూడా 73 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని ప్రభుత్వ విప్ విజయరమణ రావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ పనిచేస్తుందని ఓట్ల తొలగింపు అనేది అనైతిక చర్య అని అన్నారు. ఓటు అనేది దేశ పౌరుని హక్కు అని ఓటును తొలగించే హక్కు ఎవ్వరికీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఏ నియోజకవర్గానికి ఎన్ని నీళ్లు వచ్చాయో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేటీఆర్ చెప్పాలని ప్రభుత్వ విప్ విజయరమణ రావు అన్నారు. కన్నెపల్లి నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు వృధాగా కిందికి పోతుందని ఆ నీటిని మళ్లించవచ్చని తప్పుడు మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడు బ్యారేజీలు మేడిగడ్డ కూలగా అన్నారం సుందిళ్ల లీకేజీలైనాయని ఈ విషయంపై 2023లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాణ్యత లేని కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులకు స్వయంగా కలిసి వినతి పత్రం కూడా అందించారు అన్నారు. ఈ ప్రాజెక్టులో నీళ్లు నింపవచ్చా అని సీఎం వారి దృష్టికి తీసుకుపోగా ఈ కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అన్ని రకాల టెస్టులు చేసిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సేఫ్టీ వారు ఈ ప్రాజెక్టులోని బ్యారేజీలలో నీళ్లు నింపుతే ఆగే పరిస్థితి లేదని స్వయంగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు చెప్పిన విధంగా సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు చెప్పిన విధంగా ముందుకు పోతున్నారు. . కెసిఆర్ ఇంజనీర్ వారి అల్లుడు హరీష్ రావు సబ్ ఇంజనీర్ అయి కాళేశ్వరం ప్రాజెక్టు కడితే మూడేళ్లకే కూలిపోయింది అని విమర్శించారు. ఈ ప్రాజెక్టులో నీళ్లు ఆపితే కొట్టుకపోయే ప్రమాదం ఉందని సీఎం రేవంత్ రెడ్డి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో పాటు ఛాయలు టెస్టింగ్ కూడా పూర్తి అయ్యింది అన్నారు. కేటీఆర్ హైదరాబాద్ లేదా కరీంనగర్లోనైనా చిత్తశుద్ధి ఉంటే ప్రెస్ మీట్ పెట్టి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఏ నియోజకవర్గానికి ఎన్ని నీళ్లు ఇచ్చారో చెప్పాలి అన్నారు. మంథని లో డ్యామ్ కడితే అక్కడ నీళ్లు ఉండవు, ఎల్లంపల్లి, నంది మేడారంలో రిజర్వాయర్ లో కూడా నీళ్లు ఉండవు అని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఏ నియోజకవర్గానికి నీళ్లు ఇవ్వకుండా దొంగ లెక్క మెదక్ కు బీఆర్ఎస్ నాయకులు దోచుకపోయారు అన్నారు.

నేషనల్ డ్యామ్ అథారిటీ సూచన మేరకు మూడు బ్యారేజీలు మరమ్మతులు చేసి వచ్చే జూన్ కల్లా పనులు పూర్తి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 11,500 కోట్ల ఖర్చు చేసి ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించారని మరో 20 వేల కోట్లు పెట్టుబడి పెడితే లక్ష ఎకరాలకు డ్రావిడ్ ద్వారా సాగునీరు అందేదని, ఈ ప్రాజెక్టును విస్మరించి పోయే నీళ్లను ఎత్తిపోసి రివర్స్ పంపింగ్ ద్వారా సాగునీరు అందిస్తామని ఒకవైపు కేసీఆర్ మరోవైపు హరీష్ రావు తప్పుడు మాటలతో పైసల కక్కుర్తి పడి నాణ్యతలేని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు అన్నారు. ఎమ్మెల్యే వివేకానంద కన్నెపల్లి పంప్ హౌస్ తప్పుడు మాటలు మాట్లాడుతున్నాడని ఎద్దు , వ్యవసాయం అలపడదాపడ తెలియకుండా తెలంగాణ భవన్లో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నాడని, తీవ్రంగా విమర్శించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా ఆరు లక్షల ఎకరాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నీరు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, కడెం ,ఎల్లంపల్లి శ్రీపాద, లోయర్ మానేరు డ్యాం, మంజీరా, వరద కాలువ ఇవన్నీ నిర్మించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఎల్లంపల్లి పైపులైను 2013లో పూర్తి చేసి హైదరాబాదుకు ఐదు టీఎంసీల నీరు ఇస్తుంది కూడా కాంగ్రెస్ పార్టీ అన్నారు. కన్నెపెల్లి నుంచి నీరు కిందికి వరంగల్ జిల్లాలోని దేవాదుల, ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు కు పోతున్నాయని కేటీఆర్ తప్పుడు మాటలను మానుకోవాలి అన్నారు. కెసిఆర్ రాయలసీమలో రోజా ఇంటిలో చేపల పులుసు తిన్నప్పుడు రాయలసీమను గోదావరి నీళ్లతో సస్యశ్యామలం చేస్తామని ఆంధ్రాకు వత్తాసు పలికాడని, సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాడు అన్నారు.

# నగదు చలామణిలో వృద్ధి అయిదేళ్ల గరిష్ఠానికి

దేశీయంగా ఈనెల 15వ తేదీ నాటికి చలామణిలో ఉన్న నగదు విలువ రూ.43.46 లక్షల కోట్లకు చేరిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. గతేడాది ఇదే సమయం కంటే ఇది 13.5% ఎక్కువని, ఈ వృద్ధి అయిదేళ్ల గరిష్ఠమని వెల్లడించింది. రిజర్వ్ మనీ కూడా 10.3% వృద్ధితో రూ.53.24 లక్షల కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు 30తో ముగిసిన పక్షంలో కూడా చలామణిలో ఉన్న నగదు వృద్ధి 13.3 శాతంగా నమోదైంది.

**ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) డిపాజిట్ల వల్లేనా?**

రూపాయి పతనాన్ని ఆపే లక్ష్యంతో జూన్ 8న ప్రవేశపెట్టిన ఫారిన్ కరెన్సీ నాన్–రెసిడెంట్ (బ్యాంక్) /ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) డిపాజిట్ పథకమూ చలామణిలో ఉన్న కరెన్సీ వృద్ధికి ప్రధాన కారణాల్లో ఒకటిగా భావిస్తున్నారు. ఈ పథకం కింద ఆగస్టు 31 వరకు బ్యాంకులు 133 బిలియన్ డాలర్లు సమీకరించాయి.

2025–26లో బహిరంగ మార్కెట్ కార్యకలాపాల ద్వారా రూ.8.8 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐ కొనుగోలు చేసి, వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెంచింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ స్వాప్ సదుపాయాల ద్వారా ద్రవ్య లభ్యత పెంచింది.

ప్రస్తుతం అదనపు ద్రవ్య లభ్యతను ఉపసంహరించుకోవడాన్ని ఆర్‌బీఐ ప్రారంభించింది. విదేశీ మారకపు ద్రవ్య మార్కెట్లో ఆర్‌బీఐ జోక్యం కొనసాగడం, పండగల సమయంలో ప్రజలు అధికంగా నగదు వినియోగించడం వల్ల.. బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత మరింత తగ్గొచ్చు. దీనివల్ల రిజర్వ్ మనీ వృద్ధి మందగించే అవకాశం ఉంది.

**ఒడుదొడుకులు తట్టుకుంటున్నాం**

మన దేశం ఇంధనాన్ని అధికంగా దిగుమతి చేసుకుంటున్నా.. దేశీయ వినియోగం/సేవల రంగం బలంగా ఉండటం వల్ల ప్రపంచ ఆర్థిక పరిణామాల ప్రభావాన్ని తట్టుకోగలుగుతున్నట్లు ఆర్‌బీఐ వివరించింది.

## అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి!



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్:**

పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన వెన్నచేడ్ గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్యవెన్నచేడ్: సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వెన్నచేడ్ గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య కోరారు. ఈ మేరకు పరిగి శాసనసభ్యులు డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డిని కలిసి గ్రామంలోని అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నిజమైన అర్హులను గుర్తించి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. "గ్రామ అభివృద్ధితో పాటు పేద ప్రజల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం" అని సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంత లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మహిళా కండక్టర్‌పై దాడి అమానుషం

**దాడికి పాల్పడిన మహిళ ని కఠినంగా శిక్షించాలి**
**మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ**

**మణుగూరు :** అశ్వాపురం మండలం మిట్టగూడెం గ్రామం వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సులో విధులు నిర్వహిస్తున్న మణుగూరు డిపో మహిళా కండక్టర్ ప్రవళికపై జరిగిన దాడిని మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా ఉద్యోగిపై దాడికి పాల్పడిన మహిళా ప్రయాణికురాలిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బస్సు నడుస్తున్న సమయంలో మహిళా కండక్టర్ ప్రవళికను ఓ మహిళా ప్రయాణికురాలు బస్సు నుంచి కిందకు తోసేయడంతో ఆమె తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ఈ ఘటనలో బస్సు వెనుక చక్రం ఆమె కాళ్లపై నుంచి వెళ్లడంతో కుడికాలు విరిగిందని, మరో కాలుకు కూడా తీవ్ర గాయమైందని పేర్కొన్నారు. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా ఆమెను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికుల భద్రతపై ప్రభుత్వం స్పందించాలిమహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత డ్రైవర్లు, కండక్టర్లపై దాడులు పెరుగుతున్నాయని పాల్వంచ దుర్గ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు రవాణా సేవలు అందించే ఆర్టీసీ కార్మికులపై దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న ఉద్యోగులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆర్టీసీ యాజమాన్యం, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహిళా కండక్టర్‌పై దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సిబ్బందిపై దాడులను అరికట్టేందుకు పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఆర్ జి -2 లో ఘనంగా విజిలెన్స్ అవగాహన

**కమాన్ పూర్** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రామగుండం –2 ఏరియాలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు – 2026 ఘనంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు అక్టోబర్ 26 నుండి నవంబర్ 01 వరకు ఈ వారోత్సవాలు నిర్వహించబడుతున్నాయి. రామగుండం –2 ఏరియా జనరల్ మేనేజర్ తాళ్ళపెల్లి లక్ష్మీపతి గౌడ్ అధ్యక్షతన ఏరియా ప్రధాన కార్యాలయంలో పౌరుల సత్యనిష్ఠ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జీఎం తాళ్ళ పెల్లి లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ...ఈ సంవత్సరం విజిలెన్స్ వారోత్సవాలు నిజాయితీతో సమృద్ధి అనే నినాదం తో జరుపుకుంటునామాని తెలిపారు. సింగరేణి వంటి ప్రతిష్టాత్మక సంస్థలో ప్రతి ఉద్యోగి, అధికారి తమ విధుల్లో పారదర్శకత, నిజాయితీ, జవాబుదారీతనం పాటించాలని పిలుపునిచ్చారు. అవినీతి రహిత సింగరేణి – అభివృద్ధి చెందిన సింగరేణి అని, కంపెనీ నష్టాలను నివారించి లాభాల బాటలో నడపడానికి అవినీతిని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, కొనుగోళ్లు, కాంట్రాక్ట్ పనులలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఎక్కడైనా అవినీతి చోటు చేసుకుంటే నిర్భయంగా విజిలెన్స్ విభాగానికి తెలియజేయాలని సూచించారు. ఈ వారం రోజుల పాటు ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో ఉద్యోగులకు, కార్మికులకు అవగాహన సదస్సులు, వ్యాసరచన పోటీలు బ్యానర్లు, పోస్టర్ల ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం తాళ్లపెల్లి లక్ష్మీపతి గౌడ్ తో పాటు, ఎస్ ఓ టు జిఎం మాలోత్ రాముడు, అధికార ప్రతినిధి ఎన్ వేణు గోపాల్ అన్ని డిపార్ట్మెంట్ల హెచ్.ఓ.డి లు, అధికారులు , ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అవినీతిపై సమరం.. ప్రజలే కీలకం

**యువత, విద్యావంతులు భాగస్వాములు కావాలి:**

**నంద్యాల :** అవినీతి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో 1064 టోల్‌ఫ్రీ నంబర్ పోస్టర్లను ఆవిష్కరించారు. అక్టోబర్ 26 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐ రామాంజనేయులు, ఎస్ఐ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## పిడుగురాళ్ల టిడిపి కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**పిడుగురాళ్ల,** గురజాల నియోజకవర్గం శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రామాయణం రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా సోమవారం పిడుగురాళ్ల పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది.

## పెండింగ్లో ఉన్న రెండో విడత దళిత బంధు నిధులను విడుదల చేయాలి

**ములుగు** జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన రాష్ట్ర దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు కోగిల మహేష్ రాష్ట్ర సలహాదారు దర్శనాల సంజీవ బాధితులుగత ప్రభుత్వంలో ఎంపికైన దళిత బంధు బాధితులందరికీ జిల్లా కలెక్టర్ అకౌంట్లో ఉన్న డబ్బులను బాధితుల ఖాతాల్లో జమ చేయాలని సోమవారం గౌరవ జిల్లా కలెక్టర్ దళిత బంధు బాధితులతో కలిసి రాష్ట్ర దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు కోగిల మహేష్ దర్శనాల సంజీవ వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు కలెక్టర్ గత తెలంగాణ ప్రభుత్వం గౌరవ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు గౌరవ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారుల చేత ములుగు జిల్లాలో 1100 మంది దళిత బంధు లబ్ధిదారులు

## సీరత్-ఎ-ముస్తఫా క్విజ్ విజేతలకు బహుమతులు




**ప్రథమ బహుమతిగా రూ.10 వేల ప్రదానం**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం)**

తాజుల్ ఔలియా ఎస్‌బీఓ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీరత్-ఎ-ముస్తఫా క్విజ్ పోటీల విజేతలకు ఆదివారం మార్కండేయ కాలనీలోని అప్పర్ సంగం ఫంక్షన్ హాల్‌లో బహుమతులు అందజేశారు. హజ్రత్ సయ్యద్ మహమ్మద్ బఖ్తియార్ బియాబానీ సాహెబ్, ముఫ్తీ సాదిఖుల్ ఇస్లాం మిస్బాహీ సాహెబ్ తదితర ఉలమాల చేతుల మీదుగా నగదు బహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. పోటీల్లో తరన్నుమ్ ఖాతూన్ ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ఆయేషా సిద్ధిఖా ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు, నిషాత్ సమన్ రజ్వియా తృతీయ బహుమతిగా రూ.3,500 అందుకున్నారు. ఇతర పాల్గొన్న వారికి కూడా ధ్రువపత్రాలు అందజేశారు. ప్రవక్త మహమ్మద్ ముస్తఫా జీవిత చరిత్ర, బోధనలు, ఆదర్శాలపై యువతలో అవగాహన పెంపొందించడమే పోటీల ఉద్దేశమని ట్రస్ట్ బాధ్యులు అఫ్జల్ రజ్వీ, అడ్వకేట్ షానవాజ్ రజా ఖాన్ తెలిపారు. కార్యక్రమానికి ఉలమాలు, మతపెద్దలు, యువకులు, ప్రజలు హాజరయ్యారు.

## మానవత్వంతో బతకడమే నిజమైన జ్ఞానం



**కులమతాలకు అతీతంగా జీవించాలి**
**సమతా ఫౌండేషన్ చైర్మన్ డా. దుర్గం నగేష్**

**అగ్ని ధార న్యూస్ ,(వెంకటాపురం) :**

యువత చరిత్రను తెలుసుకొని, కులమతాలకు అతీతంగా మానవత్వంతో జీవించాలని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సమతా ఫౌండేషన్ చైర్మన్ డా. దుర్గం నగేష్ పిలుపునిచ్చారు. తన కుమార్తె జోత్స్న శ్రీ కర్ణవేదన వేడుక సందర్భంగా ఆదివారం వెంకటాపురంలోని తన నివాసంలో పాత్రికేయ మిత్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి సమతా ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గౌతమ బుద్ధుడు బోధించిన పంచశీల, అష్టాంగ మార్గాలు శాంతి, సమానత్వం, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కళింగ యుద్ధం అనంతరం అశోకుడు హింసను విడిచిపెట్టి బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడం చరిత్రలో కీలక ఘట్టమన్నారు. అశోక విజయదశమి విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, బుద్ధుడు చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. కులమత భేదాలకు తావులేకుండా పరస్పర గౌరవంతో జీవించినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం పాత్రికేయ మిత్రులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెంకటాపురం మీడియా ప్రతినిధులు సత్యనారాయణ, ఈశ్వరచారి, సంతోష్, సాక్షి రాంబాబు, మన తెలంగాణ రాంబాబు, రాజేంద్రప్రసాద్, అశోక్, మహేష్, సమ్మయ్య, గణేష్, నారాయణరావు, రమేష్, సాంబం, దుర్గం రాంప్రసాద్, రాజు, జనగాం నానాజీ తదితరులు పాల్గొన్నారు.

## డబ్బులు తీసుకుని భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదు



**సొంత అన్నలపైనే తమ్ముడి ఫిర్యాదు**

**అగ్నిధార న్యూస్ ,(వరంగల్) :**

సొంత అన్నలే భూమి విక్రయించి, డబ్బులు తీసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని దుగ్గొండి మండలం పొనకల్ గ్రామానికి చెందిన గట్ల రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐదుగురు అన్నదమ్ముల మధ్య కుటుంబ భూముల పంపకాలు జరిగాయి. ఇందులో భాగంగా తన అన్నలు గట్ల సమ్మయ్య, గట్ల సురేందర్ తమ వాటా భూమిని విక్రయించగా, తాను కొనుగోలు చేశానని పేర్కొన్నారు. భూమికి సంబంధించిన డబ్బులు పూర్తిగా చెల్లించినప్పటికీ, కొన్నేళ్లుగా రిజిస్ట్రేషన్ చేయకుండా తిప్పించుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

## సీనియర్ జర్నలిస్టు అభిలాష్ తండ్రికి నివాళి

**అగ్ని ధార న్యూస్ ,(ఆదిలాబాద్) :**



సీనియర్ జర్నలిస్టు కలాల అభిలాష్ తండ్రి కలాల హనుమన్లు ఇటీవల మృతి చెందడంతో, సోమవారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. హనుమన్లు ఆసుపత్రిలో చికిత్స పొందిన సమయంలో అందించిన వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడు చంద్రాల రాహుల్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్, సామాజిక కార్యకర్త బండారి దేవన్న, పట్టణ కార్యదర్శి లింగంపల్లి నర్సింలు, ఆదే రఘు తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



**విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్యాగులు అందజేసిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**అగ్నిధార న్యూస్ మంథని :**

మంథని నియోజకవర్గంలోని కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రోత్సహించడం, వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ విద్యార్థులతో ముచ్చటించి, వారు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవడం, విద్యా రంగ అభివృద్ధికి తోడ్పడటం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతికి, గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు.

## చిన్నారి అక్షయ్ వైద్యానికి దాతల సాయం కావాలి!

**మలేరియా, డెంగీతో పాటు లివర్ ఇన్‌ఫెక్షన్,**
**నిమ్ము సమస్యతో ఇబ్బందులు**
**నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలని వేడుకోలు**

**అగ్నిధార న్యూస్ ,(వాజేడు) :**



విధి చిన్నచూపు చూడటంతో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ చిన్నారి కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. వాజేడు మండల కేంద్రానికి చెందిన తల్లడి విజయ్ కుమారుడు అక్షయ్ గత వారం రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తొలుత జ్వరం రావడంతో ఏటూరునాగారంలో వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌కు తరలించారు. చిన్నారికి మలేరియా, డెంగీతో పాటు లివర్ ఇన్‌ఫెక్షన్, నిమ్ము సమస్యలు కూడా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మెరుగైన వైద్యం అందించేందుకు ఇప్పటికే తమ స్థాయిలో డబ్బులు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ చిన్నారి ఆరోగ్యం క్షీణిస్తుండటంతో మరింత వైద్యం చేయించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దాతలే దిక్కు..**

నిరుపేద కుటుంబానికి చెందిన విజయ్ తన కుమారుడికి మెరుగైన వైద్యం అందించేందుకు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మానవతా దృక్పథంతో స్పందించి, తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి చిన్నారి అక్షయ్ ప్రాణాలు కాపాడేందుకు తోడ్పడాలని కుటుంబ సభ్యులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం చేయదలచిన వారు ఫోన్‌పే ద్వారా పంపవచ్చు.

**ఫోన్‌పే నంబర్: 8919252732పేరు:** తల్లడి విజయ్చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అందించి ఆ కుటుంబానికి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



**అగ్నిధారన్యూస్ '(సంగారెడ్డి)"**

సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని నల్లంపల్లి,మహ్మదాపూర్,పిప్పడ్ పల్లి,కర్చల్,
హస్నాబాద్,కుస్నూర్,ఇటికేపల్లి,జాంబిగి(కె) తదితర గ్రామాలలో పవిత్ర కావ్యం రామాయణాన్ని రచించినఆదికవి వాల్మీకి మహర్షి జయంతి ని పురస్కరించుకుని సోమవారం
ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేసి మహర్షి వాల్మీకి చిత్రపటాలకు, విగ్రహాలకు పూజాకార్యక్రమాలు నిర్వహించి జయంతి వేడుకలను ఘనంగా చేయడం జరిగింది. మండలకేంద్రమైన రాయికోడ్ లో మహర్షి వాల్మీకి విగ్రహానికి పూజలు చేసి పురవీధులగుండా ఊరేగింపు నిర్వహించి మహా హారతి ఇచ్చిన అనంతరం ఉత్సవ నిర్వాహకులు అన్నప్రసాదా వితరణ గావించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి రచించిన పవిత్ర కావ్యం రామాయణాన్ని,రాముడిని ఆదర్శంగా తీసుకుని ధర్మం బాటలో నడవాలని పలువురు పెద్దలు సూచించారు.

## వల్లెంకుంటలో అంబేద్కర్ భవనానికి రూ.20 లక్షలు



**ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేసిన గడ్డం వంశీకృష్ణ**

**అగ్ని ధార న్యూస్ ,(మంథని):**

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంథని నియోజకవర్గంలోని మల్హర్ మండలం వల్లెంకుంట గ్రామంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారు. భవన నిర్మాణం పూర్తయితే గ్రామంలో సమావేశాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడనుంది. ముఖ్యంగా దళిత సామాజిక వర్గ ప్రజలకు ఈ భవనం సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## కులం పేరుతో దూషించి దాడి చేసిన వారి రిమాండ్.

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్**

కమాన్ పూర్ మండలం నాగారం గ్రామపంచాయతీ పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన అగ్గిమల్ల అనిల్ పై రొంపికుంట గ్రామంలో రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి కులం పేరుతో దూషించిన వారిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఏసిపి మడత రమేష్ తెలిపారు. ఈనెల 20న నాగారం గ్రామానికి చెందిన మాడిశెట్టి ఆదిత్య రొంపి కుంట గ్రామానికి చెందిన చిందం సాయి ప్రదీప్ బతుకమ్మ దగ్గర జరిగిన గొడవని మనసులో పెట్టుకొని అగ్గిమల్ల అనిల్ పై దాడి చేసి కులం పేరుతో దూషించారు. దీంతో అగ్గిమల్ల అనిల్ తండ్రి అగ్గిమల్ల రాజు ఫిర్యాదు మేరకు కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు మేరకు గోదావరిఖని ఏసిపి మడత రమేష్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ జరిపించారు. సోమవారం గోదావరిఖని ఏసీపి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపించినట్లు కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ పేర్కొన్నారు.

## ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు కుటుంబానికి పరామర్శ



AMC చైర్మన్ వైనాల రాజు గారికి కమాన్ పూర్ కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

వైనాల రాజు తండ్రి సాంబయ్య అకాల మరణం చేయడం వల్ల కమాన్పూర్ మండలానికి సంబంధించిన జూలపల్లి మాజీ సర్పంచ్ బొల్లపల్లి శంకరయ్య గౌడ్.. మాజీ ఎంపీటీసీ కమాన్పూర్ పిల్లి చంద్రశేఖర్.. సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి మరియు ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ సీనియర్ నాయకులు తిరుపతి వైనాల రాజు కుటుంబ సభ్యులను ఓదార్చే ప్రగాఢ సానుభూతి తెలిపినారు

## ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను ప్రకటించాలి

**నియామక క్యాలెండర్ విడుదల చేయాలి**
**తెలంగాణ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్**

**అగ్ని ధార న్యూస్,( కరీంనగర్) :**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలను వెంటనే ప్రకటించి, అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని తెలంగాణ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న యువత ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. శాఖల వారీగా నియామక క్యాలెండర్ విడుదల చేసి, నిర్దిష్ట గడువులోగా నియామకాలు పూర్తి చేయాలని కోరారు. పెండింగ్ నియామక ప్రక్రియలను వేగవంతం చేసి, పారదర్శకంగా ఉద్యోగాలను భర్తీ చేయాలని సూచించారు. నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. యువతకు న్యాయం జరిగే వరకు తెలంగాణ జనతా పార్టీ ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలి



**కలెక్టర్‌కు దళితబంధు సాధన సమితి వినతి**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి) :**

దళితబంధు రెండో విడత లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే రూ.2 లక్షల నిధులు విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గద్దల శంకర్, మంథని డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. రెండో విడత నిధుల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేసి, వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు సహా సుమారు వంద మంది పాల్గొన్నారు.

## రామగిరి ఖిల్లా ట్రెక్కింగ్.. విజేతకు వన్‌ప్లస్ ఫోన్

**యువతకు ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఛాలెంజ్**
**ఏడు గేట్లు దాటి హనుమంతుడి ఆలయాన్ని చేరుకోవాలి**

**అగ్ని ధార న్యూస్ ,(రామగిరి) :**

చారిత్రక రామగిరి ఖిల్లాకు పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ప్రాంత వారసత్వ సంపదను ప్రపంచానికి పరిచయం చేసేందుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ యువతకు ట్రెక్కింగ్ ఛాలెంజ్ విసిరారు. ఖిల్లాలోని ఏడు గేట్లను దాటి చివరగా హనుమంతుడి ఆలయాన్ని దర్శించుకోవాలని సూచించారు. ఈ ఛాలెంజ్‌ను నెల రోజుల్లో అత్యంత వేగంగా పూర్తి చేసిన విజేతకు వన్‌ప్లస్ మొబైల్ ఫోన్ బహుమతిగా అందజేయనున్నట్లు ప్రకటించారు.

ఛాలెంజ్‌ను పూర్తి చేసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 'హాయ్ వంశీ.. ఇట్స్ మీ' అంటూ తన సోషల్ మీడియా ఖాతాలను ట్యాగ్ చేయాలని కోరారు. రామగిరి ఖిల్లాను సందర్శించిన తర్వాత ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యంపై తనకు మరింత ఆసక్తి పెరిగిందని ఎంపీ తెలిపారు. యువత చారిత్రక ప్రదేశాలను సందర్శించి వాటి విశిష్టతను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ట్రెక్కింగ్ సమయంలో భద్రతా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



# మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**కనీస వేతనం రూ.42 వేలు చెల్లించాలి**

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):**

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి, నెలకు కనీస వేతనం రూ. 42 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాకు బయలుదేరిన మున్సిపల్ కార్మికుల బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, రామగుండం కార్పొరేషన్ పరిధిలోని వివిధ విభాగాల కార్మికులు పెద్ద సంఖ్యలో మహాధర్నాకు తరలివెళ్లారని తెలిపారు. కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డీఏలు అమలు చేయాలని, డైలీ వేజ్, ఎన్ఎంఆర్ కార్మికులను కాంట్రాక్టు లేదా ఔట్‌సోర్సింగ్ విధానంలోకి తీసుకురావాలని కోరారు. మరణించిన, అనారోగ్యానికి గురైన, 60 ఏళ్లు పూర్తయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించే



విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ముత్యంరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి, పెద్దపల్లి మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు మల్లారపు కొమరయ్య, ప్రధాన కార్యదర్శి బొంకూరు సాగర్, నాయకులు సుద్దాల సతీష్, గుండేటి లక్ష్మి, సరిగంటి సుశీల, పల్లె స్వప్న, కంపెల్లి దేవమ్మ, పల్లె రవి, బడుగు అంజయ్య, మద్దెల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# గాంధేయవాది భాయిజీకి ఘన నివాళి

**చంబల్ గాంధీ సేవలు చిరస్మరణీయం**

**యువత సేవా మార్గంలో నడవాలి**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి) :**

ప్రముఖ గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ ఎస్.ఎన్. సుబ్బారావు (భాయిజీ) ఐదో వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో, మార్కండేయ కాలనీలోని స్నేహ సాహితి గ్రంథాలయంలో ఘనంగా నివాళులర్పించారు. భాయిజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 13 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న భాయిజీ, అనంతరం గాంధేయ సిద్ధాంతాల ప్రచారానికి జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. చంబల్ లోయలోని బందిపోట్లను అహింసా మార్గంలోకి తీసుకొచ్చి జనజీవన స్రవంతిలో కలపడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మహాత్మాగాంధీ సేవాశ్రమాన్ని స్థాపించి, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించేందుకు నేషనల్ యూత్ ప్రాజెక్టు ద్వారా దేశవ్యాప్తంగా యువజన శిబిరాలు నిర్వహించారని తెలిపారు. జాతీయ సమైక్యత, మతసామరస్యం, మానవతా విలువల పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువత భాయిజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




శ్రీరామ విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ ఎస్. వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. స్నేహ సాహితి గ్రంథాలయంలో ఏలేశ్వరం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎన్‌వైపీ అధ్యక్షుడు కన్య వేణి యాదవ్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు భాయిజీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# జల్.. జంగల్.. జమీన్ హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీమ్

**ఆయన ఆశయాలను కొనసాగించాలి**

**సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. దుర్గం నగేష్**

**అగ్నిధార న్యూస్ ,(వెంకటాపురం) :**

ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటం చేసిన వీరయోధుడు కొమురం భీమ్ అని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. దుర్గం నగేష్ అన్నారు. కొమురం భీమ్ 86వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ఆయన విగ్రహం వద్ద భూమి పుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డా. దుర్గం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### హక్కుల కోసం చారిత్రక పోరాటం

అనంతరం డా. దుర్గం నగేష్ మాట్లాడుతూ.. కొమురం భీమ్ ఆదివాసీల హక్కుల సాధన కోసం 'జల్.. జంగల్.. జమీన్' (నీరు.. అడవి.. భూమి) అనే నినాదంతో పోరాటం సాగించారని గుర్తుచేశారు. ఆదివాసీలు తమ సహజ వనరులపై హక్కులు కలిగి ఉండాలని, తమ భూమి, అటవీ సంపద, జీవన విధానంపై స్వయంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉండాలని ఆయన పోరాడారని వివరించారు. అణచివేత, అన్యాయాలకు వ్యతిరేకంగా కొమురం భీమ్ సాగించిన పోరాటం ఆదివాసీ సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### నేటి తరానికి స్ఫూర్తి

కొమురం భీమ్ పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని డా. నగేష్ సూచించారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను భావితరాలకు తెలియజేయడం ద్వారా సమానత్వం, హక్కుల పట్ల అవగాహన పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జెజ్జరి నారాయణమ్మతో పాటు




తెలంగాణ భూమిపుత్రం ఆదివాసీ సంఘం నాయకులు విశ్రాంత ఉపాధ్యాయులు వాసం లక్ష్మయ్య, గోంధీ శేషగిరి, ఉండం రాంప్రసాద్,పొడేం సురేష్, తుర్స రాజు, పూనేమ్ పన్ పవన్ కుమార్, పూనేమ్ సాయి చరణ్, పలువురు పాల్గొని కొమురం భీమ్‌కు నివాళులర్పించారు.

# దేవుని పడకల్‌లో ఘనంగా పోచమ్మ తల్లి దేవాలయ మండల పూజలు..

**చండీ హోమం, అమ్మవారికి అభిషేకం చేసిన సర్పంచ్ అనిత మల్లేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని దేవుని పడకల్ గ్రామ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో మండల పూజ కార్యక్రమాన్ని పురస్కరించుకుని చండీ హోమం, అమ్మవారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ చండీ హోమం నిర్వహించి, శ్రీ పోచమ్మ తల్లికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. మెల్లూరి సందీప్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు ప్రార్థించారు. మండల పూజ కార్యక్రమంతో దేవాలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు



చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు ఐకమత్యంతో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా సంప్రదాయాలు, భక్తి భావాలను భావితరాలకు అందించవచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో, గ్రామ ఉప సర్పంచ్ అంబటి వెంకటేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, భక్తులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆదికవి వాల్మీకి ఆశయాలు ఆదర్శనీయం



**విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన**

**అగ్నిధార న్యూస్అక్టోబర్ 26మహమ్మదాబాద్/గండీడ్:**

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వాల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదికవి వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన జీవిత విశేషాలను, భారతీయ సాహిత్యానికి చేసిన అపారమైన సేవలను స్మరించుకున్నారు. సంస్కృత సాహిత్యంలో ఆదికవిగా ప్రసిద్ధి చెందిన వాల్మీకి మహర్షి రచించిన రామాయణం ప్రపంచవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు పొందింది. సత్యం, ధర్మం, న్యాయం, త్యాగం, కర్తవ్యనిష్ఠ వంటి గొప్ప మానవీయ విలువలను రామాయణం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారు. ఆయన జీవితం మనిషి తన ఆలోచనలను, ప్రవర్తనను మార్చుకుని సన్మార్గంలో పయనించవచ్చనే గొప్ప సందేశాన్ని అందిస్తుంది. వాల్మీకి మహర్షి సాహిత్య సేవలు భారతీయ సంస్కృతికి చిరస్మరణీయమని, ఆయన రచనలు తరతరాలకు స్ఫూర్తినిస్తూ సమాజానికి నైతిక విలువలను బోధిస్తున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చిన్ననాటి నుంచే సత్యం, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం, మానవత్వం వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు.

రామాయణంలోని ఆదర్శాలను జీవితంలో ఆచరించడం ద్వారా మంచి పౌరులుగా ఎదగవచ్చని, మహర్షుల జీవిత చరిత్రలు విద్యార్థుల్లో జ్ఞానాన్ని, నైతికతను, సత్ప్రవర్తనను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణ దేవి, ఉపాధ్యాయులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, బి. మల్లేష్, ప్రీ ప్రైమరీ టీచర్ దాసరి వసంత, ఆయా సానేం శిరీష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల కోసం ప్రజావాణిలో ఎమ్మార్వోకు ఎంపీడీవో కి వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు



**అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్:**

మహమ్మదాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జర్నలిస్టులు ఇళ్ల స్థలాల మంజూరు కోసం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారని, వారి సేవలను గుర్తించి ప్రభుత్వం ఇళ్ల స్థలాల విషయంలో తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల వినతిని పరిశీలించి, ఇళ్ల స్థలాల మంజూరుకు సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలరాజ్, గౌరవ అధ్యక్షులు నాగరాజ్, టి యు డబ్ల్యూ హెచ్ 143 కొత్త గోపాల్, జనరల్ సెక్రెటరీ వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్లు గోవర్ధన్, దస్తయ్య, కోశాధికారి హనుమంతు, రామకృష్ణారెడ్డి, మహేందర్, నవీన్ కుమార్, మల్కయ్య, రమేష్, రఘుపతి రెడ్డి, గౌరీ శంకర్, జర్నలిస్టులు పాల్గొని వినతిపత్రం సమర్పించారు.

## హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



**వేడుకల్లో పాల్గొన్న వాల్మీకి బోయ చైర్మన్ గట్టు తిమ్మప్ప, వైస్ చైర్మన్ బోయ నాగేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

హైదరాబాద్ మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వాల్మీకి బోయ చైర్మన్ గట్టు తిమ్మప్ప, వైస్ చైర్మన్ బోయ నాగేష్, కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల మాజీ అధ్యక్షుడు గుజ్జుల మహేష్, పవన్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు వాల్మీకి సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకల్లో భాగస్వాములయ్యారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని, ఆయన రచించిన రామాయణం సమాజానికి అందించిన విలువలను స్మరించుకున్నారు. మహర్షి వాల్మీకి బోధనలు, ఆదర్శాలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని పలువురు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వాల్మీకి సంఘం నాయకులు, సభ్యులు ఉత్సాహంగా పాల్గొని మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం, నైతిక విలువలను పెంపొందించడంలో మహర్షి వాల్మీకి జీవితం, సందేశాలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో,వాల్మీకి సంఘం నాయకులు సభ్యులు పవన్ వాల్మీకి తది తరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

**ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

అగ్నిధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి పట్టణంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన కార్యాచరణ, అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడం, పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో ఎన్నికల సన్నద్ధత వంటి అంశాలపై జిల్లా, మండల స్థాయి నాయకులతో చర్చించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు



నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా వారికి అవసరమైన అవగాహన కల్పించాలని, నమోదు ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని సమావేశంలో చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరిస్తూ, ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అలాగే, భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, స్థానిక స్థాయిలో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ఎన్నికల కార్యాచరణ అమలు తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో, వివిధ మండలాలకు చెందిన నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మార్చాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు పరిశీలన..

**అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో**
**కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రం, బాలాజీ కాటన్ మిల్లును జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, కాటన్ మిల్లు కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. ముందుగా మార్చాల గ్రామంలో ఆవంచ వెంకటయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఇంటి నిర్మాణం పూర్తయి, లబ్ధిదారుడు అందులో నివాసం ఉంటున్న తీరును పరిశీలించారు. అనంతరం ఇంటి నిర్మాణానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల వివరాలను వెంకటయ్యను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన బిల్లులన్నీ మంజూరయ్యాయని, ఫైనల్ బిల్లు మాత్రం ఇంకా మంజూరు కాలేదని వెంకటయ్య కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లు మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల



నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం బిల్లుల చెల్లింపులు జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతున్న చిన్నారులకు అందుతున్న ఆహారం, కేంద్రం రోజువారీ నిర్వహణ, పిల్లలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమైనందున, వారికి అందించే సేవల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, చిన్నారుల హాజరు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

అనంతరం గ్రామ పరిధిలోని బాలాజీ కాటన్ మిల్లును జిల్లా కలెక్టర్ సందర్శించి, మిల్లు రోజువారీ నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. రైతుల నుంచి ప్రతిరోజూ ఎంత పరిమాణంలో పత్తిని సేకరిస్తున్నారు, సేకరించిన పత్తిని మిల్లులో ఏ విధంగా ప్రాసెస్ చేస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. మిల్లులో పత్తి సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్‌కు సంబంధించిన కార్యకలాపాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లు నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తూ, పత్తి సేకరణ ప్రక్రియ, రోజువారీ కార్యకలాపాలపై సంబంధిత మిల్లు యజమాని ,సిబ్బందితో చర్చించారు. ఈ కార్యక్రమంలో,సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తలసాని వెంకట చల్మరెడ్డి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు నిజాముద్దీన్,అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి..

**రైతులకు 75 శాతం గడ్డి విత్తనాలు పంపిణీ చేయాలి**
**అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసి**
**సస్పెన్షన్‌కు ఆదేశాలు,**
**మార్చాల గ్రామంలో వ్యవసాయ క్షేత్రం,డైరీ ఫామ్‌ను పరిశీలించిన,**
**కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన రైతులకు చేరేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందని, అయితే క్షేత్రస్థాయిలో రైతులకు కనీస అవగాహన కల్పించకపోవడంపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పశు పోషణ ద్వారా జీవనోపాధి పొందుతున్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీల గురించి తెలియక, వారు ప్రైవేటుగా అధిక ధరలకు గడ్డి విత్తనాలు కొనుగోలు చేస్తున్న విషయాన్ని గుర్తించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన మండల పశుసంవర్ధక శాఖ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసి, సంబంధిత జిల్లా అధికారికి సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేశారు.దకల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పర్యటించి రైతులు చేపడుతున్న వ్యవసాయ, పశుపోషణ కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు, వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా వారు పొందుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.

ముందుగా మార్చాల గ్రామానికి చెందిన రైతు తాజుద్దీన్ తన వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసుకున్న ఫామ్ పాండ్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయానికి నీటి వనరులను వినియోగించుకునేందుకు చేపట్టిన ఈ ఏర్పాటు గురించి రైతును అడిగి వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న కార్యకలాపాలు, నీటి వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రైతు కృష్ణయ్య మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్వహిస్తున్న డైరీ ఫామ్‌ను సందర్శించారు. పశువుల పెంపకం, వాటి పోషణ, పశువులకు అవసరమైన దాణా, పచ్చిమేత అందుబాటు వంటి అంశాలను కలెక్టర్ రైతులు అడిగి తెలుసుకున్నారు. డైరీ ఫామ్ నిర్వహణ ద్వారా రైతు పొందుతున్న ప్రయోజనాలు, పశుపోషణలో ఎదురవుతున్న సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డైరీ ఫామ్‌ను పరిశీలిస్తున్న క్రమంలో పశువులకు అవసరమైన పచ్చిమేత కోసం గడ్డి విత్తనాలను ఎక్కడి నుంచి సమకూర్చుకుంటున్నారని జిల్లా కలెక్టర్ రైతు కృష్ణయ్యను ప్రశ్నించారు. తాము ప్రైవేటుగా గడ్డి విత్తనాలను కొనుగోలు చేస్తున్నామని రైతు సమాధానమిచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా సబ్సిడీపై గడ్డి విత్తనాలను సరఫరా చేస్తున్నప్పుడు ప్రైవేటుగా ఎందుకు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ రాయితీని ఎందుకు వినియోగించుకోవడం లేదని ఈ అంశంపై కలెక్టర్ ఆరా తీశారు.అందుకు రైతు స్పందిస్తూ, ప్రభుత్వం నుంచి సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్న విషయం తమకు తెలియదని, ఈ పథకం గురించి సంబంధిత అధికారులు ఎవరూ తమకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. దీంతో రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంలో అధికారుల పనితీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పశుపోషక రైతులకు ఆ సమాచారం తెలియకపోవడంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే పథకాల గురించి తెలియజేయాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని ప్రశ్నించారు. రైతులు పశువుల మేత కోసం అవసరమైన గడ్డి విత్తనాలను ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్నప్పుడు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ గురించి వారికి తెలియజేయకపోవడం ఏమిటని సంబంధిత అధికారులను కలెక్టర్ నిలదీశారు. క్షేత్రస్థాయిలో రైతులతో నిరంతరం సంబంధాలు కలిగి ఉండి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వారికి వివరించాల్సిన అధికారులు ఆ బాధ్యతను ఎందుకు నిర్వర్తించలేదని కలెక్టర్ ప్రశ్నించారు. ప్రభుత్వం రైతుల కోసం పథకాలు అమలు చేయడమే కాకుండా, వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు భావించిన మండల పశుసంవర్ధక శాఖ ఏవో డాక్టర్





నాగరాజును సస్పెండ్ చేయాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ శాఖ ఏఈఓ సురేష్ కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ, డైరీ ఫామ్‌ల నిర్వహణ ద్వారా అదనపు ఆదాయం పొందేందుకు ప్రభుత్వం వివిధ పథకాలు, రాయితీలు అందుబాటులోకి తీసుకువస్తోంది. అయితే, ఆ పథకాల గురించి రైతులకు సరైన సమాచారం అందకపోతే వాటి ప్రయోజనాలు ఆశించిన స్థాయిలో అందవు అని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,, తహసిల్దార్ ఇబ్రహీం, ఎంపీడీవో యాదయ్య,మండల విద్యా అధికారి శంకర్,మార్చాల పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉప సర్పంచ్ నిజాముద్దీన్ ,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.

# మృతుని కుటుంబానికి అండగా పార్టీ జిల్లా నాయకులు గణేష్ రావు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వంగూరు మండల కేంద్రంలో బండపల్లి రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వేనేపల్లి గణేష్ రావు, మరియు మాజీ సర్పంచ్ అక్కి లావణ్య ఎల్లాగౌడ్, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అతని ఆత్మకు శాంతి చేకూరాలని 10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ అన్ని విధాలుగా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమం లో, గ్రామ అధ్యక్షులు బండపల్లి జంగయ్య, వార్డ్ సభ్యులు సుమన్ ,అక్కి మురళీ, నారమోని జంగయ్య, బండపల్లి శివకుమార్, లట్టుపల్లి మురళి, , సోషల్ మీడియా ఇన్చార్జ్ ఎల్లికంటి మురళి, అయినాల రమేష్, బాషమోని కృష్ణ, దామోదర్, రమేష్, బండపల్లి శ్రీశైలం, బుచ్చిరాములు, శ్రీశైలం, సి లక్ష్మయ్య,భాషమోని వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుపై ఆర్ఎస్పీ ఫౌండేషన్ అవగాహన కార్యక్రమం




అగ్నిధార న్యూస్ (కల్వకుర్తి)

పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో ఆర్ఎస్పీ ఫౌండేషన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ, అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఓటరు నమోదుకు అవసరమైన వివరాలపై తెలియజేస్తూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావడం ద్వారా ఎన్నికల ప్రక్రియలో తన భాగస్వామ్యాన్ని నిర్ధారించుకోవచ్చని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బావండ్ల మధు, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు కుడుముల మనోహర్ రెడ్డి, ఆర్య వైశ్య సంఘం నాయకుడు దాచేపల్లి శ్రీనివాసులు, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు రుక్మోద్దీన్, రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్, ఉపసర్పంచ్ భీం, ఫౌండేషన్ సభ్యులు అశ్విన్, చందు, కిరణ్, రాము, పార్టీ నాయకులు సురేష్ గౌడ్, బీమ్లా నాయక్, శ్రీరామ్, పూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యత మైన బోధనతో పాటు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలి..



**దాతల సహకారంతో ఏర్పాటు చేసిన షెడ్డు పరిశీలన**
**ప్రాథమిక పాఠశాలను సందర్శించిన,కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామంలోని, ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించి, పాఠశాల వాతావరణాన్ని పరిశీలించి, అక్కడి విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు తీరుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో మొత్తం ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధతో బోధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు.ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా 54 మంది విద్యార్థులు పాఠశాలలో చేరడంతో, ప్రస్తుతం మొత్తం 106 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. అలాగే, ఈ పాఠశాలలో చదివిన ఆరుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందినట్లు వివరించారు. స్థానిక పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుండటంతో విద్యార్థులు ఇక్కడే చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని, విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలు ఆకుకూరలను కిచెన్ గార్డెన్ ద్వారా పండించిన ఆకుకూరలను ఉపయోగిస్తున్నట్లు, దాతల సహకారంతో విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకునేందుకు సహకారంతో షెడ్‌ను ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యా వాతావరణాన్ని, విద్యార్థుల అభ్యసన పురోగతిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో, సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీవో యాదయ్య, మార్చాల పంచాయతీ కార్యదర్శి రమేష్, రిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వెంకట చల్మరెడ్డి, ఉప సర్పంచ్ నిజాముద్దీన్ ,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.

# తీన్మార్ మల్లన్నను సన్మానించిన బీసీ సంఘం నాయకులు



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి పట్టణంలో జరిగిన కార్నర్ మీటింగ్ భాగంగా తీన్మార్ మల్లన్నను జూపల్లి బీసీ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో,పెద్దయ్య యాదవ్,బిక్షపతి యాదవ్, వెంకటయ్య గౌడ్ , వరి కుప్పల బాలు సత్యం యాదవ్,గెలువయ్య,మహ్మద్ సిరాజ్,పాల్గొన్నారు.

# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగు నీటి ట్యాంకుల పరిశుభ్రత

**సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన గ్రామ ప్రజలు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'స్వచ్ఛ జలధార' కార్యక్రమం కొనసాగుతోంది. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం కల్వకుర్తి మండలంలోని కుర్మిద్ద గ్రామంలో తాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రపరిచారు.



**జర్మన్ సాంకేతికతతో ట్యాంకుల శుభ్రత..**

స్వచ్ఛ జలధార కార్యక్రమంలో మూడవ విడతలో భాగంగా కుర్మిద్య గ్రామపంచాయతీ పరిధిలోని తాగునీటి నిల్వ ట్యాంకులను ప్రత్యేక యంత్రాల సహాయంతో శుభ్రం చేశారు. జర్మన్ సాంకేతికతతో కూడిన యంత్రాలను వినియోగించి ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి పరిశుభ్రపరిచారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను మెరుగుపరచడం, నీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం, ప్రజారోగ్యాన్ని కాపాడటం వంటి లక్ష్యాలతో ఐక్యత ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో దశలవారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిం చనున్నారు.

**ప్రజారోగ్యానికి ప్రాధాన్యం..**

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండటం ఆరోగ్య పరిరక్షణలో కీలకమని, నీటి నిల్వ ట్యాంకులను క్రమం తప్పకుండా శు భ్రపరచడం ద్వారా నీటి పరిశుభ్రతను కాపాడుకోవచ్చని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఐక్యత ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమం గ్రామీణ ప్రజలకు ఉపయోగకరంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ నాగరాజు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు ,వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించాలని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డికి వినతి పత్రం

**సానుకూలంగా స్పందించిన పరిగి ఎమ్మెల్యే**

**అగ్నిధార న్యూస్ అక్టోబర్ 26మహమ్మదాబాద్/గండీడ్:**

మండలాలకు చెందిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డికి రిపోర్టర్లు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు సమాజంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టులకు సొంత ఇల్లు ఉండాలనే ఆశయం నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని పరిగి ఎమ్మెల్యేను కోరారు. రిపోర్టర్లు అందజేసిన వినతిపత్రంపై పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లామని, తమ విజ్ఞప్తికి సానుకూల స్పందన లభించడం పట్ల రిపోర్టర్లు హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల చిరకాల స్వప్నమైన సొంత ఇంటి కల నెరవేరేలా సంబంధిత అధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మహమ్మదాబాద్, గండీడ్ మండల రిపోర్టర్లు టి



యు డబ్ల్యూ హెచ్ 143 అధ్యక్షులు బోయిని గోపాల్, కొత్త గోపాల్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సి బాలరాజ్, గౌరవాధ్యక్షులు నాగరాజు, జనరల్ సెక్రెటరీ, డి వెంకటేష్, దానకరి రవి, ఉపాధ్యక్షులు, దస్తయ్య, గోవర్ధన్, టి యు డబ్ల్యూ హెచ్ 143 ప్రధాన కార్యదర్శిలు రామకృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బి ఆంజనేయులు,జె వీరాజీ, కె వెంకటేష్, కోశాధికారి హనుమంతు, సభ్యులు నవీన్ కుమార్,మల్కయ్య, మహేందర్, రమేష్, రఘుపతి రెడ్డి, గౌరీ శంకర్, పాల్గొన్నారు

## 19వ డివిజన్ లో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**6 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం.**

**సుమారు 1,200 గృహాలకు తాగునీటి సదుపాయం లక్ష్యం**

**గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే మన ప్రాంతం కుప్పకూలింది.**

**ఎమ్మెల్యే ఎం రాజ్ ఠాకూర్**

**అగ్నిధారన్యూస్ 8 ఇంక్లైన్ కాలనీ/ గోదావరిఖని26:**



సోమవారం రోజున,8వ కాలనీ 19వడివిజన్ ఇంద్రానగర్‌లో రూ.1 కోటి 90 లక్షల వ్యయంతో 6 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి విచ్చేస్తున్నరామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు,రాజ్ ఠాకూర్ ,నగర మేయర్ మహంకాళి స్వామి తో కలిసి భూమి పూజ నిర్వహించారు ఈ కార్యక్రమం19వ డివిజన్ కార్పొరేటర్ మారెల్లి సుశీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో ఇంద్రానగర్ ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయం కల్పించే దిశగా మరో ముందడుగు పడింది. ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయితే సుమారు 1,200 గృహాలకు తాగునీటి సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులుప్రణాళికలురూపొందిస్తున్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి ఇంటికీ పైపులైన్ల ద్వారానీటినిఅందించేందుకుఈప్రాజెక్టుఎంతోఉపయోగకరంగా నిలవనుంది. అన్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. రామగుండం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని,ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, ప్రతి డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషిచేస్తున్నామని,ముఖ్యంగా తాగునీరు వంటి ప్రాథమిక అవసరాల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 8వకాలనీ ఇంద్రానగర్‌లో నిర్మించనున్న ఈ వాటర్ ట్యాంక్ ద్వారా స్థానిక ప్రజలకు నీటి సరఫరామరింతమెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, సింగరేణి సంస్థల సహకారంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని, అభివృద్ధి పనుల అమలులో ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రతి కాలనీకి అవసరమైన వసతులు కల్పించే దిశగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడమే తమ లక్ష్యమని పేర్కొంటూ, రామగుండం అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములై సహకరించాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేషన్ అధ్యక్షులు ముస్తఫా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలరాజు,లింగస్వామితో పాటు కార్పొరేటర్లు శంకర్ నాయక్,స్వరూప రాములు, చక్రపాణి, శ్రీనివాస్, రాము, సతీష్,సాంబమూర్తి. 8వ కాలనీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజేష్,దామోదర్,రమేష్ రెడ్డి,శ్రీనివాస్,రాజు, అజయ్,రాజేశం, హరిహర, ప్రశాంత్,సునీత, స్వరూప, సంధ్య, నర్మద, వివిధ విభాగాలఅధ్యక్షులు,మహిళా కార్యకర్తలు,డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం



**ఎస్టీ జాబితాలో వాల్మీకి సామాజిక వర్గాన్ని చేర్చేందుకు కేసీఆర్ కృషి-నిరంజన్‌రెడ్డి**

**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:**

ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం కృషికి, పట్టుదలకు, పరివర్తనకు నిదర్శనమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా నాగవరంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం తన స్వగృహంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. వేటగాడిగా జీవితాన్ని ప్రారంభించిన వాల్మీకి మహర్షి తనలో పరివర్తన తెచ్చుకొని ఆదికవిగా ఎదిగి, రామాయణాన్ని రచించి ధర్మం, సత్యం, న్యాయం, మానవత్వం వంటి విలువలను ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు. మనిషిని గొప్పవాడిని చేసేది పుట్టుక కాదని, అతని ఆలోచనలు, ఆచరణ, వ్యక్తిత్వమేనని వాల్మీకి జీవితం నిరూపిస్తోందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన వాల్మీకి సామాజిక వర్గ అభివృద్ధిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని ప్రభుత్వపరంగా నిర్వహించేందుకు ప్రత్యేక జీవో తీసుకురావడంతోపాటు, చల్లప్ప కమిషన్ ద్వారా వాల్మీకి సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సిఫార్సు చేయడం జరిగిందన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆ సామాజిక వర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, గంధం పరంజ్యోతి, కె. మాణిక్యం, ఉంగ్లం తిరుమల్, వేణుగోపాల్, దేవర్ల నరసింహ, నీలస్వామి, పెద్దముక్కల రవి, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్యదర్శి నీ సన్మానించిన మహ్మద్ సిరాజ్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

చారాకొండ మండలంలోని జూపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఇస్లావత్ వినోద్ ని ఘనంగా సన్మానించిన జూపల్లి భాస్కరరావు యువసేన సభ్యులు సిరాజ్ ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్యం మరియు మౌలిక వసతుల అభివృద్ధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ జూపల్లి గ్రామ అభివృద్ధికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ యువ నాయకుడు సిమర్ల సత్యం యాదవ్, జూపల్లి భాస్కర్ రావు యువసేన అధ్యక్షుడు ఎండి సిరాజ్ పాల్గొని నూతన కార్యదర్శి కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 26వ జాబ్ డ్రైవ్

**సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



మాడ్గుల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రత్యేక సహకారంతో 26వ జాబ్ డ్రైవ్‌ను అక్టోబర్ 28వ తేదీ బుధవారం మాడ్గులలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాడ్గుల ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమకు తగిన ఉద్యోగాలను పొందాలని నిర్వాహకులు సూచించారు.

**శ్రీ వాసవి ఫంక్షన్ హాల్‌లో ఇంటర్వ్యూలు**

ఈ జాబ్ డ్రైవ్‌లో భాగంగా అక్టోబర్ 28వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి మాడ్గులలోని శ్రీ వాసవి ఫంక్షన్ హాల్‌లో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాల కోసం హాజరుకావచ్చు.

**అభ్యర్థులకు ఉచిత రవాణా, భోజన సౌకర్యాలు..**

మాడ్గుల నుంచి తుక్కుగూడలోని సంబంధిత కంపెనీకి ఎంపికైన అభ్యర్థుల రవాణా కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఉద్యోగులకు ఉచిత భోజన సౌకర్యంతో పాటు పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్), ఈఎస్ఐ (ఉద్యోగుల రాష్ట్ర బీమా) వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను వెంట తీసుకురావాలని సూచించారు.

**నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పనలో మరో ముందడుగు.**

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడటం లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పలు జాబ్ డ్రైవ్‌లను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో మాడ్గుల ప్రాంతంలో చేపడుతున్న 26వ జాబ్ డ్రైవ్ నిరుద్యోగ యువతకు ఉపాధి సాధించే అవకాశంగా నిలవనుంది. అర్హత కలిగిన యువతీ యువకులు నిర్ణీత సమయంలో ఇంటర్వ్యూ కేంద్రానికి చేరుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 7702880519 9848244119

## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ మరోసారి మానవత్వాన్ని చాటుకుంది. కల్వకుర్తి మండలంలోని గుండూర్ గ్రామానికి చెందిన మెంట శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహాయం అందించారు. గుండూర్ గ్రామానికి చెందిన మెంట శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందిన విషయం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు, గ్రామ సర్పంచ్ అయినేని లక్ష్మమ్మ ద్వారా ఉప్పల వెంకటేష్ దృష్టికి వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి, మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి బాధలో ఉన్న కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం కొంతమేర అండగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడంలో ఉప్పల వెంకటేష్ ముందుండటం అభినందనీయమని స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు, మాజీ ఉప సర్పంచ్ నాగయ్య, వార్డు సభ్యులు రాజేందర్, నాగేంద్రం, సత్యనారి, జానీ, శైలేశ్వర్, మల్లయ్య, గోపాల తదితరులు పాల్గొన్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com